ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



కాకినాడ
జిల్లా వార్తలు

సోమవారం 29 జూలై 2024 | 5



పి.గన్నవరం అక్విడెక్టు వద్ద డొక్కా సీతమ్మ విగ్రహం

కూలిన బతుకులు



అన్నదమ్ముల మృతదేహాలు

గండేపల్లి శివారు మురారి వద్ద ఘోర ప్రమాదం

బైక్‌పై నుంచి అదుపుతప్పి పడిపోయిన తల్లి, ముగ్గురు కుమారులు

వారిపై నుంచి దూసుకుపోయిన గుర్తు తెలియని వాహనం

ముగ్గురు కుమారులు అక్కడికక్కడే మృతి

తల్లికి తీవ్రగాయాలు..ఆస్పత్రికి తరలింపు

7లో



పాదాలమ్మకు బోనాలు

గొల్లప్రోలులో సంబరాలు..

'సీతమ్మా'.. స్మరామి!

నేడు గ్రీవెన్స్

కలెక్టరేట్(కాకినాడ), జూలై 28: కాకినాడ కలెక్టరేట్ గ్రీవెన్స్ హాల్‌లో సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ షాన్‌మోహన్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. అలాగే రెవెన్యూ డివిజన్, మండల స్థాయిలో నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ అన్ని మండలాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంట వరకు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ప్రజల నుంచి వినతులను స్వీకరించనున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమానికి జిల్లా అధికారులు హాజరు కావాలని ఆదేశించారు.

పిఠాపురంలో ఆర్టీసీ బోర్డింగ్ పాయింట్

విశాఖపట్నం నాన్‌స్టాప్, పాతపట్నం, నర్సీపట్నం బస్సులకు హాల్ట్

కార్పొరేషన్(కాకినాడ), జూలై 28: పిఠాపురం పరిసర గ్రామ ప్రజల సౌకర్యార్థం కాకినాడ నుంచి బయలుదేరు విశాఖపట్నం నాన్‌స్టాప్ బస్సులు, పాతపట్నం, నర్సీపట్నం బస్సులకు పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద బోర్డింగ్ పాయింట్ ఏర్పాటు చేసినట్లు కాకినాడ ఆర్టీసీ డిపో మేనేజర్ మనోహర్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పిఠాపురంలో ఏర్పాటు చేసే కౌంటర్‌లో టికెట్ తీసుకున్న వారు పిఠాపురం పాదగయ క్షేత్రం వద్ద బస్సుల్లో ఎక్కవచ్చు, దిగవచ్చునని ఆయన ప్రకటనలో పేర్కొన్నారు.





రేట్లు కనపడకుండా చింపేసిన బ్యానర్

తలుపులమ్మ లోవ భక్తుల
జేబు గుల్ల

తలుపులమ్మ లోవ దేవస్థానంలో 'టోల్' బాదుడు

నిర్దేశించిన రేట్ల కంటే రెట్టింపు వసూళ్లు

భక్తుల నుంచి అనధికార దోపిడీ

ప్రేక్షక పాత్ర వహిస్తున్న అధికారులు

ప్రసిద్ధి పుణ్యక్షేత్రం లోవ దేవస్థానానికి సుదూర ప్రాంతాల నుంచి నిత్యం వందలాది వాహనాల్లో అమ్మవారి దర్శనానికి వస్తున్న భక్తులను టోల్ పేరుతో కొంత మంది పిండేస్తున్నారు. అధికంగా వసూలు చేస్తూ దోచుకుంటున్నారు. ఆలయ నిబంధనల ప్రకారం దేవస్థానం నిర్దేశించిన రేట్లకే నిర్వాహకులు టోల్ ఫీజు వసూలు చేయాల్సి ఉన్నా ఆ నిబంధనలను తుంగలోకి తొక్కి ఇష్టం వచ్చిన రీతిలో వసూళ్లకు పాల్పడుతున్నారని భక్తులు వాపోతున్నారు.

ఇష్టారాజ్యంగా వసూళ్లు..

తుని రూరల్, జూలై 28: ఆలయానికి వెళ్లే మార్గంలో టోల్‌గేట్ వద్ద దేవస్థానం ఏర్పాటు చేసిన ధరల పట్టికను పట్టించుకోకుండా తమకు ఇష్టమైన ధరలను నిర్ణయించుకున్న కాంట్రాక్టర్లు వాహనదారుల నుంచి ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. లారీలు, టూరిస్ట్ బస్సుకు రూ.100, వ్యాన్, ట్రాక్టర్, టాటా సుమో, జీపు వంటి వాహనాలకు రూ.70, చిన్నకారుకు రూ.50, ఆటోలకు రూ.15, బైక్‌లకు రూ.10 తీసుకోవాలని దేవస్థానం అధికారులు నిర్ణయించారు. కానీ ఈ రేట్లు ఎక్కడా అమలయిన దాఖలాలు ఎప్పుడూ లేవు. బస్సుకు రూ.200, కార్లకు రూ.100, ఆటోలకు రూ.30, బైక్‌లకు 20 ఇలా ప్రతీది డబుల్ చేసి బాదేస్తున్నారు. పాట దక్కించుకున్న వారు ఇలా అడ్డంగా దోపిడీ చేస్తున్న విషయం బహిరంగ రహస్యమే..కానీ ఆలయ అధికారులు మాత్రం నియంత్రించే చర్యలు తీసుకోకపోవడం గమనార్హం.

ఆషాఢంలో వారికి పండగే..

ప్రస్తుతం ఆషాఢమాసం కావడంతో ప్రతి ఆదివారం వేలాదిగా వాహనాలు తలుపులమ్మ లోవకు వస్తున్నాయి. దీంతో దోచుకున్నవారికి దోచుకున్నంత అన్నట్లు అడ్డుగోలుగా వసూలు చేసేస్తున్నారు. దూర ప్రాంతాల నుంచి వచ్చిన వారికి ఇదంతా తెలియకపోవడం, అక్కడ ధరలు సూచించే పట్టిక ఏదీ లేకపోవడంతో అక్రమ వసూళ్ల దందా మూడు పువ్వులు, ఆరు కాయలుగా సాగుతోంది.. ఇప్పటికైనా అధికారులు చర్యలు తీసుకుని నిబంధనల ప్రకారం దేవస్థానం నిర్దేశించిన ధరలను వసూలు చేసేలా చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.



పి గన్నవరం మండలం లంకలగన్నవరంలో డొక్కా సీతమ్మ నివాసం

- అపర అన్నపూర్ణమ్మకు లభించిన గుర్తింపు
- మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు
- కూటమి ప్రభుత్వం నిర్ణయంపై సర్వత్రా హర్షాతిరేకాలు

పి.గన్నవరం, జూలై 28: అపర అన్నపూర్ణగా ప్రసిద్ధి చెందిన డొక్కా సీతమ్మకు కూటమి ప్రభుత్వం అపూర్వమైన గౌరవాన్ని అందించింది. పాఠశాలల్లో అమలులో ఉన్న 'జగనన్న గోరుముద్ద' పథకాన్ని డొక్కా సీతమ్మ మధ్యాహ్న బడి భోజనంగా మార్పుచేశారు. మారుమూల లంక గ్రామంలో బ్రిటీష కాలంలో అడిగిన వారికి లేదనకుండా అన్నం వండి వడ్డించిన సీతమ్మకు సముచిత గౌరవం దక్కడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా మండపేటలో 1841 సంవత్సరంలో అనప్పిండి భవానీశంకరం-నరసమ్మ పుణ్య దంపతులకు జన్మించిన సీతమ్మను లంకలగన్నవరం గ్రామానికి చెందిన జోగన్నకు ఇచ్చి 1850లో వివాహం చేశారు. వారికి ఇద్దరు కుమారులు, కుమార్తెలు జన్మించారు. పెళ్లైన ఏడాది దాటిన నాటి నుంచే నిత్యం అడిగిన వారికి లేదనకుండా అన్నం పెట్టిన ఘనత సీతమ్మకే దక్కుతుంది. బ్రిటిష హయాంలో అప్పటి కలెక్టర్ సీతమ్మ తయారుచేసిన గరిక వేళ్ల పచ్చడి రుచి చూసి ఆశ్చర్యపడ్డారు. అలా సీతమ్మ అన్నదానం దశదిశలా వ్యాపించింది. ఈమె ఖ్యాతి గురించి తెలుసుకున్న ఏడవ ఎడ్వర్డ్ తన పట్టాభిషేకం సమయంలో ఆమె ఫొటోను తీయించి వెంటనే పంపించాలని అప్పటి కలెక్టర్‌కు లెటర్ రాశారు. దానిని సీతమ్మకు అందించి ఫొటో కావాలని కలెక్టర్ కోరగా మొదట అంగీకరించలేదు. తాను ప్రచారం కోసం ఈ సేవ చేయడం లేదని ఆమె సున్నితంగా అడ్డుచెప్పగా, కలెక్టర్ తాను మీ ఫొటో పట్టాభిషేకానికి పంపకపోతే తన ఉద్యోగానికి ఎసరు అవుతుందని చెప్పడంతో ఆమె అంగీకరించి ఫొటో దిగారు. ఈ ఫొటోను ఒక ప్రత్యేక ఆసనంలో ఉంచి ఎడ్వర్డ్ పట్టాభిషేకం చేసినట్లు చెబుతారు. తర్వాతకాలంలో ఆ ఫొటోను బ్రిటిష ప్రభుత్వం ప్రత్యేకంగా ఉంచి లండన్‌లో ఏర్పాటుచేసిందని చెబుతారు. లండన్ పార్లమెంటులో ఉన్న సీతమ్మ ఫొటోను లోక్‌సభ స్పీకర్ బాలయోగి స్వయంగా చూసి ఆమె తమ కోనసీమకు చెందినవారని అక్కడి వారికి చెప్పగా, తనకు ప్రత్యేక గౌరవం లభించిందని బాలయోగి చెప్పేవారు. ఇక లంకల గన్నవరంలో సీతమ్మ నివాసం, గృహోపకరణాలు, వంటసామగ్రిని ఆమె కుటుంబీకులు భద్రపరిచారు. ఇల్లు శిథిలావస్థకు చేరుకోగా, మరమ్మతులు చేయించి నేటి తరానికి అందుబాటులో ఉంచారు. సీతమ్మ నివాసం పి గన్నవరం మండలం లంకలగన్నవరంలో ప్రధాన రహదారి నుంచి సుమారు కిలోమీటరు దూరంలో ఉంటుంది. సీతమ్మ నివాసం వైపు చూపిస్తూ పర్యాటకశాఖ ఏర్పాటుచేసిన సూచిక శిథిలమైంది. సీతమ్మ నివాసానికి కూతవేటు దూరంలో ఏర్పాటు చేసిన మరో బోర్డు కూడా విరిగిపడంతో ఓ గోడకు నిలబెట్టారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వస్తే డొక్కా సీతమ్మ క్యాంటీన్లు ఏర్పాటు చేస్తామని ఎన్నికల ప్రచార బహిరంగ సభల్లో జనసేన అధినేత పవన్‌కల్యాణ్ ప్రకటించారు. నేటి యువతకు ఆదర్శంగా ఉండాలనే లక్ష్యంతో సీతమ్మ పేరును ప్రతిపాదించడాన్ని అప్పుడు అన్ని వర్గాలూ స్వాగతించాయి. చెప్పినట్టుగానే మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయంపై గోదావరి జిల్లాల ప్రజానీకం అంతా సంబరపడుతోంది.

పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలి



మధ్యాహ్న భోజన పథకానికి డొక్కా సీతమ్మ పేరు పెడుతూ కూటమి ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షదాయకం. సీఎం చంద్రబాబునాయుడు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్‌లకు ప్రత్యేక ధన్యవాదాలు. సీతమ్మ నివాసాన్ని అభివృద్ధిచేసి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దాలని మా కుటుంబం తరపున ప్రభుత్వానికి విజ్ఞప్తి చేస్తున్నాం. పి.గన్నవరం అక్విడెక్టుకు అప్పట్లో టీడీపీ ప్రభుత్వమే సీతమ్మగా నామకరణం చేసి ప్రత్యేక గౌరవం ఇచ్చింది. మళ్లీ ఈ నిర్ణయం తీసుకోవడం సంతోషంగా ఉంది.

- డొక్కా భీమవెంకట కామేశ్వరరావు, సీతమ్మ ఐదో తరం వారసుడు



ఎదిగిన నారుమడి

వర్షాలు పడడంతో ముమ్మరంగా జరుగుతున్న దమ్ము పనులు

ఖరీఫ్ పనులు

విస్తారంగా వర్షాలు పడడంతో వరినాట్లు ఆరంభం

దమ్ములు పడుతున్న రైతులు

వ్యవసాయ పనుల్లో అన్నదాతలు బిజీ



తిమ్మాపురంలో నాట్లు

కిర్లంపూడి, జూలై 28: అల్పపీడనం ప్రభావంతో వర్షాలు విస్తారంగా పడుతుండడంతో మండలంలో ఖరీఫ్ వరి నాట్లు ప్రారంభమయ్యాయి. ఈ ఏడాది కొంత ఆలస్యమైనప్పటికీ వరిసాగు చేసేందుకు రైతులు సిద్ధమయ్యారు. వరి నారు సిద్ధంగా ఉండడంతో గ్రామాల్లో రైతులు వరి నాట్లు వేస్తున్నారు. కిర్లంపూడి మండలం భూపాలపట్నం, తిమ్మాపురం, తామరాడ, కిర్లంపూడి, చిల్లంగి, రాజుపాలెం గ్రామాల్లోని కురుస్తున్న వర్షాలకు పుష్కలంగా నీరు చేరడంతో రైతులు దమ్ము ప్రారంభించి వరినాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. అలాగే ఏలేరు కాలువల్లో పూర్తిస్థాయిలో నీరు విడుదల కావడంతో వ్యవసాయ పనులు మొదలెట్టారు. వర్షపు నీటితోనే దమ్ములు చాలా వరకు పూర్తికావొచ్చంటున్నారు. అయితే ఏలేరు కాలువ వెంబడి నీరు రావడంతో ఈ ఖరీఫ్ సీజన్‌లో పుష్కలంగా పంటలు పండించే అవకాశముందని రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. చెరువులు కూడా కళకళలాడడంతో రైతులు దమ్ములు చేయడం, వరినాట్లు వేయడం వంటి పనుల్లో బిజీబిజీగా గడుపుతున్నారు. దీంతో ప్రస్తుతం ఖరీఫ్ కళ కనిపిస్తుంది. ఈఏడాది ఖరీఫ్ మొదట్లోనే వర్షాలు కురవడం దానికి తోడు ఏలేరు నిండుకుండలా మారడం, పుష్కర కాలువ నీరు ఏలేరుకు అనుసంధానం చేయడంతో సాగుకు ఎటువంటి ఇబ్బంది ఉండదని రైతులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.



పూజలు నిర్వహిస్తున్న పండితులు

తలుపులమ్మ లోవ కిటకిట



అమ్మవారిని దర్శించుకుంటున్న భక్తులు

తునిరూరల్,జూలై 28: తలుపులమ్మ లోవ దేవస్థానం ఆదివారం భక్తులతో కిటకిటలాడింది. ఆషాఢమాస ఆదివారం కావడంతో వేలాదిగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి అమ్మవారికి మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ పండితులు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు. 4వ ఆదివారం పురస్కరించుకుని అమ్మవారికి లక్ష పుష్పార్చన కార్యక్రమాన్ని ఆలయ పండితులు నిర్వహించారు. అధిక సంఖ్యలో తరలివచ్చిన భక్తులు ప్రత్యేక క్యూలైన్లలో బారులు తీరి అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు చెల్లించుకున్నారు. ఆలయ ప్రాంగణంలో దేవస్థానం ఏర్పాటు చేసిన వంట షెడ్‌లు, వసతి గదుల్లో వంటావార్పు చేసుకుని కుటుంబ సమేతంగా సహపంక్తి భోజనాలు చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా జిల్లా పోలీస్ శాఖ ఆధ్వర్యంలో తుని రూరల్ సీఐ, ఎస్‌ఐలు 100 మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేసి ట్రాఫిక్ చక్కదిద్దారు. భక్తుల సౌకర్యార్థం అన్ని ఏర్పాట్లు చేసి ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు చేపట్టినట్లు ఆలయ ఈవో విశ్వనాథరాజు తెలిపారు. ఆలయానికి వివిధ విభాగాల ద్వారా భక్తుల నుంచి రూ.12.84 లక్షల ఆదాయం సమకూరినట్లు ఆలయ అధికారులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పిఠాపురం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధికి
సమష్టిగా కృషి చేద్దాం



సమావేశంలో మాట్లాడుతున్న కృష్ణతేజ

గ్రామాల్లో సమస్యలపై నివేదికలు ఇవ్వండి

15రోజులకు ఒకసారి నియోజకవర్గంలో పర్యటిస్తా

కలిసి పనిచేసి అభివృద్ధి వైపు అడుగులు వేద్దాం

పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణతేజ

జిల్లా స్థాయి అధికారులు, సర్పంచ్‌లతో సమావేశాలు

పిఠాపురం/పిఠాపురం రూరల్, జూలై 28: సమష్టిగా పనిచేసి పరస్పర సమన్వయం, భాగస్వామ్యంతో పిఠాపురం నియోజకవర్గాన్ని అభివృద్ధి చేద్దామని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ మైలవరపు కృష్ణతేజ సూచించారు. డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ సూచనల మేరకు శనివారం పిఠాపురం నియోజకవర్గంలోని గ్రామాల్లో విస్తృతంగా పర్యటించిన ఆయన ఆదివారం పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో జిల్లాస్థాయి అధికారులు, నియోజకవర్గ, మండల అధికారులు, అన్ని గ్రామాల సర్పంచ్‌లతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. వారి నుంచి అన్ని వివరాలు సేకరించారు. అధికారులతో నిర్వహించిన సమావేశంలో పింఛన్ల పంపిణీకి అనుసరిస్తున్న విధానం, సీసీ రోడ్లు, డ్రెయిన్లు, ఇతర నిర్మాణ పనులు, ఇంటింటికి కుళాయి కనెక్షన్లు, సీపీడబ్ల్యూ పథకం పనులు, తాగునీటి సరఫరా, పారిశుధ్యం నిర్వహణ తదితర అంశాలపై సమీక్షించారు. అన్ని గ్రామాల్లో సీసీ రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణానికి ప్రణాళికలు సిద్ధం చేయాలని సూచించారు. గ్రీవెన్స్‌లో ఎక్కువగా ఏ ఫిర్యాదులు వస్తున్నాయి, వాటిని ఏ విధంగా పరిష్కరిస్తున్నారన్న విషయంపై ఆరా తీశారు.

సర్పంచ్‌లతో సమావేశం

పిఠాపురం, గొల్లప్రోలు మండలాలకు చెందిన పంచాయతీల సర్పంచ్‌లతో కృష్ణతేజ సమావేశమయ్యారు. తాగునీరు, రోడ్లు, డ్రెయిన్ల నిర్మాణం, ఉద్యానవన పంటల సాగుకు ప్రోత్సాహకాలు, జనాభా ప్రాతిపదికన గ్రామాల్లో డంపింగ్ యార్డుల ఏర్పాటు, పారిశుధ్య కార్మికుల వేతనాలు, విద్యుత్ బిల్లుల బకాయిలు, సిబ్బంది కొరత, వీధిలైట్ల నిర్వహణలో సమస్యలు, మౌలిక సదుపాయాల కల్పనకు ఎదురవుతున్న నిధుల కొరత తదితర విషయాలు గురించి సర్పంచ్‌లు కృష్ణతేజకు వివరించారు. గ్రామాల్లో ఉన్న సమస్యలు, వాటి పరిష్కారానికి ఉన్న పరిమితులు దృష్ట్యా అభివృద్ధికి ప్రత్యేక చర్యలు చేపడతామని కృష్ణతేజ తెలిపారు. తాను 15 రోజులకు ఒకసారి పిఠాపురం నియోజకవర్గంలో పర్యటిస్తానని చెప్పారు. గ్రామాల్లో పర్యటించి పరిస్థితులను సమీక్షిస్తానని, ఏ సమస్య ఉన్నా సర్పంచ్‌లు నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చునని చెప్పారు. అంతకు ముందు సర్పంచ్‌లు వివిధ అంశాలపై వినతిపత్రాలు అందజేశారు. అనంతరం కృష్ణతేజను సత్కరించారు. సమావేశంలో జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామచంద్రమూర్తి, డ్వామా పీడీ ఏ.వెంకటలక్ష్మి, డీఆర్డీఏ పీడీ శ్రీరమణి, డీపీవో భారతి సౌజన్య, పంచాయతీరాజ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈలు మల్లికార్జునరావు, సత్యనారాయణ, డీఎల్‌డీవోలు పాటంశెట్టి నారాయణమూర్తి, ప్రసాద్, డిప్యూటీ సీఈవో రామగోపాల్ పాల్గొన్నారు.



దుర్గేష్‌కు జ్ఞాపిక అందిస్తున్న కళా పరిషత్ సభ్యులు

భోగాపురంలో జాతీయ స్థాయి నాటిక పోటీలు

పిఠాపురం, జూలై 28: కాకినాడ జిల్లా పిఠాపురం మండలం భోగాపురం గ్రామంలో వచ్చే ఏడాది జనవరి 16 నుంచి 19వ తేదీ వరకూ భోగాపురం కళాపరిషత్ ఆధ్వర్యంలో కొణిదెల పవన్‌కల్యాణ్ జాతీయస్థాయి నాటికల పోటీలు, వారాహి అవార్డుల ప్రదానోత్సవం జరగనుంది. ఇందుకు సంబంధించిన కరపత్రాలను ఆదివారం రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ ఆవిష్కరించారు. నాటక కళను ప్రోత్సహించాల్సిన ఆవశ్యకత ఉందని మంత్రి ఈ సందర్భంగా తెలిపారు. నాటిక పోటీలు విజయవంతం కావాలని ఆకాంక్షించారు. కాగా పోటీల్లో పాల్గొనే సమాజాలు తమ ప్రవేశ పత్రాలను అక్టోబరు 15వ తేదీలోగా భోగాపురం కళా పరిషత్‌కు అందజేయాలని అధ్యక్షుడు అడపా సూరిబాబు సూచించారు. పూర్తి వివరాలకు సెల్ నెంబరు 7661866999లో సంప్రదించాలని కోరారు.

ఆకతాయిల రాళ్ల దాడి

తలుపులమ్మ లోవకు వెళ్తున్న భక్తుడి మృతి..తూరంగి వద్ద ఘటన

- 7లో

'కూలి'న బతుకులు

- కూలీ కోసం వెళుతూ కానరాని లోకాలకు..
- మురారిలో ఘోర రోడ్డు ప్రమాదం
- తల్లి పరిస్థితి విషమం.. ముగ్గురు కుమారులు మృతి
- బైక్ అదుపు తప్పి పడిపోవడంతో గుర్తుతెలియని వాహనం ఢీకొట్టిన వైనం
- మృతులు భీమవరం మండలం తాడేరు గ్రామవాసులు



సంఘటనా స్థలంలో మృతిచెందిన నంగలం రాజు, నంగలం ఏసు, నంగలం అఖిల్

గండేపల్లి, జూలై 28: కూలీ పనులు చేసుకుంటే కానీ పూటగడవని కుటుంబాన్ని మృత్యువు కబళించేసింది. కూలీ పనులకు వెళ్లి తిరిగి సొంతూరుకు వస్తుండగా మృత్యువు గుర్తుతెలియని వాహన రూపంలో వచ్చి ముగ్గురినీ బలితీసుకోగా మరో మహిళ అపస్మారక స్థితికి చేరుకుంది. దీనికి సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.. పశ్చిమగోదావరిజిల్లా భీమవరం మండలం తాడేరు గ్రామానికి చెందిన నంగలం దుర్గ తన కుమారులైన నంగలం రాజు(20), నంగలం యేసు(18), నంగలం అఖిల్(10) సొంతూరులో ఉపాధి లేక నర్సీపట్నం ఏరియా కుంతలం గ్రామానికి ఈనెల 17న ఉపాధి నిమిత్తం పామాయిల్ గెలలు కోయడానికి వెళ్లారు. అక్కడ పది రోజులపాటు పనిచేసుకుని తిరిగి తమ సొంతూరుకు శనివారం సాయంత్రం 6.30కు తల్లితో పాటు ముగ్గురు కుమారులు పల్సర్‌బైక్‌పై బయలుదేరారు. అయితే గండేపల్లి మండలం మురారి గ్రామశివారునకు వచ్చేసరికి ప్రమాదం జరిగింది. అప్పటికే చినుకులు పడడంతో ద్విచక్రవాహనం అదుపుతప్పి కిందపడగా గుర్తుతెలియని వాహనం వారి మీద నుంచి వెళ్లిపోయినట్లు పోలీసులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రమాదంలో ముగ్గురు కుమారులు అక్కడికక్కడే మృతి చెందడంతో మహిళ తీవ్ర గాయాలపాలైంది. ఈవిషయం హైవే మొబైల్ సిబ్బంది రాముకు తెలియగానే వెంటనే గండేపల్లి ఎస్ఐ ఎన్.రామకృష్ణ, జగ్గంపేట సీఐ ఎస్.లక్ష్మణరావుకు సమాచారం అందించారు. దీంతో హుటాహుటిన సీఐ, ఎస్ఐ, పోలీసు సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని గాయాలపాలైన దుర్గను 108లో రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అక్కడే పడి ఉన్న మృతదేహాలను పరిశీలించి ప్రమాద ఘటనపై సమాచారం సేకరించి ట్రాఫిక్‌కు ఇబ్బంది లేకుండా చర్యలు తీసుకున్నారు. మృతదేహాలను రాజమండ్రి ప్రభుత్వాస్పత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించి సీఐ ఎస్.లక్ష్మణరావు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టారు. ఈప్రమాద ఘటన చూసిన స్థానికులు ఉలిక్కిపడ్డారు. ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు ఒకేసారి మృతి చెందడంతో ఆ దారిలో వెళ్లేవారు సైతం చింతించారు. రెక్కాడితేకాని డొక్కాడని ఈకుటుంబం సొంతూరులో ఉపాధి కరువై వేరే ప్రాంతానికి పనికి వెళ్లి తిరిగొస్తుండగా మృత్యుఒడిలోకి చేరిపోవడం అక్కడ అందరినీ కంటతడి పెట్టించింది.



ప్రమాదఘటనపై విచారణ చేస్తున్నాం: జగ్గంపేట సీఐ

ఈప్రమాద సంఘటనపై పూర్తిస్థాయిలో విచారణ వేగవంతం చేశాం. పల్సర్ బైక్ వర్షానికి అదుపుతప్పి ప్రమాదం జరిగి ఉండవచ్చు. అదే సమయంలో వెనుక నుంచి వచ్చే గుర్తుతెలియని వాహనం వీరిని ఢీకొట్టి ఉండవచ్చు. దీనిపై పూర్తిస్థాయిలో నిర్ధారించాల్సి ఉంది. తొందరగా విచారణ చేసి వాహనాన్ని పట్టుకుంటామని, జాతీయరహదారి వెంబడి సీసీ పుటేజీలు పరిశీలిస్తున్నామని సీఐ అన్నారు.

తాడేరులో విషాదం



మృతులు నంగలం రాజు, నంగలం ఏసు, నంగలం అఖిల్

భీమవరంరూరల్, జూలై 28: కాకినాడ జిల్లా గండేపల్లి మండలం మురారి గ్రామశివారులో జరిగిన ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు కుమారులు, వారి తల్లికి గాయాలైన ఘటనతో భీమవరం రూరల్ తాడేరులో విషాదచాయలు నెలకొన్నాయి. గ్రామానికి చెందిన నంగలం కోటయ్య కుటుంబం కాయకష్టాన్ని నమ్ముకుంది. ఎక్కువగా తాపీ పనులకు వెళ్లి జీవనం సాగిస్తుంటారు. 365 రోజులపాటు ఎక్కడ ఏపని ఉన్నా ఆ కుటుంబం వెళ్లిపోతోంది. అనకాపల్లి జిల్లా నర్సీపట్నంలో పామాయిల్ గెలలు కోసేందుకు వెళ్లి పది రోజుల అనంతరం శనివారంరాత్రి తాడేరు వస్తుండగా ప్రమాదం జరిగింది. ఈసారి కోటయ్య మినహా భార్య దుర్గ, ముగ్గురు కుమారులు నర్సీపట్నం వెళ్లారు. రెప్పపాటులో తనువు చాలించారు. కోటయ్య భార్య దుర్గ గాయాలపాలైంది. ముగ్గురు కుమారులు ప్రాణాలు కోల్పోవడంతో ఆ తండ్రి తల్లడిల్లిపోతున్నారు. చిన్నకుమారుడు అఖిల్ భీమవరంలోని గునుపూడి ప్రభుత్వ పాఠశాలలో ఐదో తరగతి చదువుతున్నాడు. తల్లిదండ్రులు తమ బిడ్డను పని వద్దకు తీసుకుపోతుంటారు. ఈసారి పాఠశాలకు వెళ్లకుండా అఖిల్ తన తల్లి దుర్గతో నర్సీపట్నం వెళ్లి ప్రమాదంలో దుర్మరణం పొందాడు. తల్లిదండ్రులు కోటయ్య, దుర్గలకు తీరని కడుపుకోత మిగిలింది. పాఠశాలకు వెళ్లి ఉంటే అఖిల్ ప్రాణాలతో మిగిలేవాడంటూ తాతయ్య నంగలం కృష్ణమూర్తి కన్నీటి పర్యంత మవుతున్నారు.

31న ఐసీపీ కోర్సుల్లోని సీట్ల భర్తీకి కౌన్సెలింగ్

- మూడు విభాగాల్లో మిగిలిన సీట్ల భర్తీ
- హాజరుకానున్న ఇన్‌ఛార్జి వీసీ కేవీఎస్‌జీ మురళీకృష్ణ

జేఎన్టీయూకే, జూలై 28: ఇంటర్నేషనల్ కొలాబొరేటివ్ ప్రోగ్రాం(ఐసీపీ) కోర్సులలోని సీట్లు, ఎన్ఆర్ఐ సీట్ల భర్తీకి సంబంధించిన రెండో దశ కౌన్సెలింగ్‌ను బుధవారం జేఎన్టీయూకేలోని సెనేట్‌హాల్లో నిర్వహించనున్నట్లు వర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏఎం ప్రసాద్ తెలిపారు. ఎఫ్‌యూఏఆర్ డైరెక్టర్ శివనాగరాజు, యూసీఈకే ప్రిన్సిపాల్ ఎంహెచ్‌ఎం కృష్ణప్రసాద్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ కౌన్సెలింగ్‌లో ఇన్‌ఛార్జి ఉపకులపతి కేవీఎస్‌జీ మురళీ కృష్ణ ముఖ్య అతిధిగా పాల్గొంటున్నారన్నారు. ఈకోర్సుల్లో చేరిన విద్యార్థులు మొదటి మూడేళ్లు కాకినాడ జేఎన్టీయూకేలోనూ, చివరి మూడేళ్లు బీటీహెచ్ స్వీడన్‌లోనూ చదవాల్సి ఉంటుందన్నారు. అయితే 4వ ఏడాది కోర్సును బీటీహెచ్‌లో పూర్తిచేశాకా ప్రోగ్రాంనుంచి వైదొలిగే అవకాశం ఉందని తెలిపారు. సీఎస్ఈ, ఏఐఎంఎల్, ఈసీఈ కోర్సులలో మొత్తం 60సీట్లు ఉండగా ఈనెల 18న నిర్వహించిన మొదటి దశ కౌన్సెలింగ్‌లో సీఎస్ఈలో 5, ఏఐఎంఎల్‌లో 12, ఈసీఈలో 2సీట్లు భర్తీ అయ్యాయన్నారు. మిగిలిన సీట్ల భర్తీకి సంబంధించిన రెండో దశ కౌన్సెలింగ్‌ను ఈనెల 31 నిర్వహిస్తామని తెలిపారు.

సత్యదేవుడి సన్నిధిలో హైకోర్టు న్యాయమూర్తి పూజలు



సత్యదేవుడి దర్శనానంతరం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి

అన్నవరం, జూలై 28: ప్రముఖ పుణ్యక్షేత్రమైన సత్యదేవుడి సన్నిధిలో ఆదివారం ఆంధ్రప్రదేశ్ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ రవినాథ్ తిల్హారి కుటుంబసభ్యులతో స్వామిని దర్శించి ప్రత్యేకపూజలు నిర్వహించారు. వారికి ఆలయ పీఆర్వో కృష్ణారావు ఆలయ మర్యాదలతో ఘనస్వాగతం పలికారు. దర్శనానంతరం వేదపండితులు వేదాశీర్వచనం అందజేయగా పీఆర్వో స్వామివారి చిత్రపటం, ప్రసాదాలు అందించారు.

ఆకతాయిల దాడిలో ఒకరి మృతి

- మరో ముగ్గురికి గాయాలు
- లోవ వెళుతున్న భక్తులపై తూరంగి వద్ద అల్లరిమూక దాడి ఘటన

అంబేడ్కర్ కోనసీమ జిల్లా ముమ్మిడివరం నగర పంచాయతీ సోమిదేవరపాలెం నుంచి తలుపులమ్మలోవ వెళుతున్న భక్తుల బృందంపై అల్లరిమూక దాడి చేసిన ఘటనలో ముమ్మిడివరం నగర పంచాయతీ సోమిదేవరపాలెం చిన ఉందుర్తిపేటకు చెందిన ఒక వ్యక్తి మృతి చెందగా మరో ముగ్గురు గాయపడ్డ సంఘటన శనివారం అర్ధరాత్రి జరిగింది.



గాలిదేవుడు మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు, ఇన్‌సెట్‌లో గాలి దేవుడు (ఫైల్)



వివరాలు వెల్లడిస్తున్న ఎస్‌డీపీవో డాక్టర్ హనుమంతురావు

కాకినాడ క్రైం/ముమ్మిడివరం, జూలై 28 ఆకతాయిల దాడిలో ఒకరు మృతి చెందగా మరో ముగ్గురు గాయాలపాలైన సంఘటన శనివారం అర్ధరాత్రి కాకినాడలో చోటుచేసుకుంది. ఆదివారంరాత్రి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేఖరుల సమావేశంలో కాకినాడ ఎస్‌డీపీవో డాక్టర్ హనుమంతురావు వెల్లడిస్తున్న వివరాలిలా ఉన్నాయి. డాక్టర్ అంబేద్కర్ కోనసీమజిల్లా ముమ్మిడివరం మండలం సోమదేవరపాలెం పంచాయతీ సూరయ్య చెరువు గ్రామానికి చెందిన సుమారు 10 మంది కలిసి తలుపులమ్మ అమ్మవారి దర్శనార్ధం శనివారం రాత్రి టాటా మ్యాజిక్ వాహనంలో బయలుదేరారు. ఆ వాహనం అర్ధరాత్రి 12 గంటల సమయంలో కాకినాడ, జగన్నాధపురం, మునసబుగారి సెంటరు శివాలయం వద్దకు వచ్చేసరికి ముగ్గురు ఆకతాయిలు బైక్‌పై వచ్చి టాటా మ్యాజిక్ వాహనాన్ని అడ్డగించారు. అందులో బైక్ పైన ఉన్న వ్యక్తి ముందు సెంటర్‌లో మా వాహనాన్ని ఢీ కొట్టి వచ్చింది మీరే కదా అంటూ వారిపై విరుచుకుపడ్డారు. మాకు తెలియదు అని చెబుతున్నా వినకుండా మీతోపాటు మరో రెండు వాహనాలు ఉంటాయి అని అంటూ ఎవరికో ఫోన్ చేశారు. దాంతో మరి కొద్దిసేపటికి మరో నాలుగు బైక్‌లతో అక్కడకి చేరుకున్నాయి. అనంతరం వారు రాళ్లతో టాటా మ్యాజిక్ వాహన అద్దాలు పగులగొట్టారు. వాహనంలో ఉన్నవారు బయటకు పరుగులు తీయగానే ఆ ఆకతాయిలు పరుగులు పెడుతున్న వారిని రాళ్లతో విచ్చక్షణా రహితంగా కొట్టి పరారయ్యారు. అది గమనించిన స్థానికులు క్షతగాత్రులను ఆటోలో జీజీహెచ్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలో చెట్ల గాలిదేవుడు (46) మృతి చెందాడు. క్షతగాత్రుల్లో ఉందుర్తి సాయిరామకృష్ణ, ఉందుర్తి వెంకటకుమారస్వామి, మట్టపర్తి నాగేశ్వరరావు జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. బాధితుడు చెట్ల శ్రీరామచరణ్ సూర్యతేజ ఇచ్చిన ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదుచేసి దర్యాప్తు చేపట్టి ఆదివారం 10 మంది నిందితులను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో స్థానిక జగన్నాధపురంనకు చెందిన 19ఏళ్ల గన్నె దిలీప్, చేశెట్టి ఆనందకుమార్, పినపోతు దుర్గాప్రసాద్, కొడబాల రాజు, కాలాడి కార్తిక్, 20 ఏళ్ల కర్రి వెంకటదుర్గారావు, 24 ఏళ్ల కామాడి లోకేష్, 23 ఏళ్ల బుట్టల విజయ్, 19 ఏళ్ల బొడ్డు మణికంఠ, 20 ఏళ్ల దారపు వెంకటదుర్గారావు ఉన్నారు. వీరులో ఒకరు మైనర్ కావడంవల్ల అతన్ని జువైనల్ హోం కు తరలించనున్నట్లు ఎస్‌డీపీవో తెలిపారు. కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ వి.సురేష్‌బాబు, తదితరులు పాల్గొన్నారు.

ఉందుర్తిపేటలో విషాదం

ఆషాడమాసం చివరి ఆదివారం తలుపులమ్మలోవలో అమ్మవారిని దర్శించుకుని మొక్కుబడులు తీర్చుకుందాం అని ఎంతో సరదాగా బయలుదేరిన భక్తుల బృందానికి అల్లరిమూకల దాడితో విషాదం మిగిల్చింది. శనివారం రాత్రి సోమిదేవరపాలెం చిన ఉందుర్తిపేటకు చెందిన డ్రైవర్‌తోపాటు పదమూడు మంది టాటా మేజిక్ వాహనంలో లోవ బయలుదేరారు. మార్గమధ్యంలో అర్ధరాత్రి 12 గంటల సమయంలో అల్లరిమూక దాడిలో చేట్ల గాలిదేవుడు మృతిచెందగా టాటా మేజిక్ వ్యాను డ్రైవర్‌తోపాటు ముగ్గురు గాయపడ్డారు. దీంతో గ్రామంలో విషాదచాయలు అలుముకున్నాయి. గాలిదేవుడు ఆటో నడుపుకుంటూ కుటుంబాన్ని పోషించుకుని జీవనం సాగిస్తున్నాడు మృతుడి భార్య నూకరత్నం ఆశ కార్యకర్తగా పనిచేస్తుంది. ఇద్దరు కుమారుల్లో పెద్దకుమారుడు నితిన్ పూర్తిగా దివ్యాంగుడు. రెండో కుమారుడు శ్రీరామ్‌కు వివాహమైంది. గాలిదేవుడు, భార్య నూకరత్నం, నితిన్‌లు కలిసి జీవిస్తున్నారు. ఆ కుటుంబానికి మృతుడే ఆధారం. అందరితో ఎంతో కలివిడిగా ఉంటూ అందరినీ ఆప్యాయంగా పలుకరిస్తూ ఎవరికి ఏ చిన్న ఆపద వచ్చినా వారికి అడ్డుపడుతూ ఉండే గాలిదేవుడు అల్లరి మూక చేతిలో మృత్యువాతకు గురవడంతో కుటుంబంలో విషాదం నెలకొంది. గాలిదేవుడు మృతితో కుటుంబ సభ్యులు రోదిస్తున్నారు. దైవ దర్శనానికి వెళ్లి తిరిగిరాని లోకాలకు వెళ్లిపోవడంతో కుటుంబ సభ్యులు రోదిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టిస్తోంది.

ఉడిమూడిలంకలో పడవ బోల్తా

- లంక గ్రామాల్లోకి వాటర్ ప్యాకెట్లు తీసుకువెళ్తున్న పడవ
- పడవలో ప్రయాణిస్తున్న ఆరుగురిలో ఒకరు గల్లంతు
- సురక్షితంగా బయటపడ్డ ఐదుగురు వ్యక్తులు



గల్లంతైన చదలవాడ విజయకృష్ణ(ఫైల్)



ఉడిమూడిలంక పడవ బోల్తా ఘటనలో సురక్షితంగా బయటపడ్డ ఐదుగురు వ్యక్తులు

పి.గన్నవరం, జూలై 28: ఉడిమూడిలంక గ్రామానికి వాటర్ ప్యాకెట్లు తీసుకు వెళ్తున్న పడవ ప్రమాదవశాత్తూ తిరగబడటంతో పడవలో ప్రయాణిస్తున్న ఐదుగురు సురక్షితంగా బయటపడగా ఒకరు గల్లంతయ్యారు. స్థానికులు, అధికారులు తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని ఉడిమూడిలంక గ్రామం లో తాగునీరు నిమిత్తం అధికారులు వాటర్‌ప్యాకెట్లు తీసుకువెళ్లే క్రమంలో పడవను ఏర్పాటు చేశారు. ఉడిమూడి చింతావారిపేట సమీపంలో ఏటిగట్టు దిగువున గోదావరి నదీపాయలో సుమారు 200వాటర్ ప్యాకెట్ల బస్తాలను ఐదుగురు వ్యక్తులు పడవపై ఎగమతి చేసుకుని అవతలి ఒడ్డుకు బయలు దేరారు. పడవ 20 మీటర్లు ప్రయాణించిన తరువాత నీటిలో సుడులు రావడంతో ఐదుగురు వ్యక్తులు బయపడి పడవను నడిపే వ్యక్తి వద్దకు చేరారు. ఈక్రమంలో పడవ తిరగబడి పడవలో ప్రయాణిస్తున్న ఉడిమూడిలంకకు చెందిన మద్దా మురళి(పడవ డ్రైవర్), ఉడిమూడి శివారు పెదపేటకు చెందిన నేలపూడి యోహన్, నేలపూడి వెంకటేశ్వరరావు, గిడ్డి ఈశ్వర్(పంచాయతీ వర్కర్), గిడ్డి సత్యనారాయణలు సురక్షితంగా ప్రాణాలతో బయటపడగా చదలవాడ విజయకృష్ణ(27) వరద ఉధృతిలో గల్లంతయ్యాడు. అయితే వారిలో సురక్షితంగా బయటపడిన ఐదుగురు లైఫ్‌జాకెట్లుతో ఉన్నారని విజయకృష్ణ లైఫ్‌జాకెట్టు ధరించలేదని చెబుతున్నారు. ఈత వచ్చిన ఈశ్వర్ విజయకృష్ణకు లైఫ్‌జాకెట్టు ఇచ్చినప్పటికీ ప్రయోజనం లేకపోయిందని వరద ఉధృతిలో గల్లంతయ్యాడని చెబుతున్నారు. కాగా పడవ మునిగిన వెంటనే ఏటిగట్టుపై ఉన్న ఉమ్మిడి అంబేద్కర్ బూరుగులంకరేవులో ఉన్న వారికి సమాచారం అందించాడు. వెంటనే స్పందించి హెడ్‌కానిస్టేబుల్ మురళీకృష్ణ, కంఠంశెట్టి రాజు, చిన్నం శ్రీను, చీకరమిల్లి రామచంద్రరావులు రెండు ఇంజన్ పడవలపై బయలుదేరి వెళ్లారు. సంఘటనా స్థలికి సుమారు రెండు కిలోమీటర్లు దూరం వరకు వరద ఉధృతిలో కొట్టుకుపోయి నదీపాయ చెంతనే తుప్పలను పట్టుకుని వేలాడుతున్న ముగ్గురిని ఒక పడవలో సురక్షితంగా తీసుకురాగా మరో ఇద్దరిని బెల్లంపూడి సమీపంలో నాటుపడవతో ఉన్న స్థానికులు రక్షించి ఎదురుగా వస్తున్న రెండవ పడవకు అప్పగించారు. సురక్షితంగా బయటపడిన ఐదుగురును బూరుగులంక రేవు వద్దకు చేర్చారు. సంఘటనా స్థలానికి ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణతో పాటు ఆర్డీవో జివివి సత్యనారాయణ, డీఎస్పీ కేవీ రమణ, ఎస్ఐ బి.శివకృష్ణ చేరుకుని సంఘటనా వివరాలు తెలుసుకున్నారు. ఎమ్మెల్యే, ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు నాలుగు బోట్లుతో 24 మంది ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది నదిపాయ వద్దకు చేరుకుని సంఘటనా స్థలం వద్ద గాలింపు చర్యలు చేపట్టారు.

లైఫ్ జాకెట్లే వారికి లైఫ్‌నిచ్చాయి

నీటిలో ప్రయాణం చేసే సమయంలో లైఫ్ జాకెట్లు ధరించడం ఎంత ముఖ్యమో ఈ సంఘటన రుజువు చేసింది. లైఫ్ జాకెట్లు లేకపోతే ఆ ఐదుగురు కూడా ఆ వరద ఉధృతిలో కొట్టుకుపోయేవారు. లైఫ్‌జాకెట్లు ధరించడంతో వారి ప్రాణాలను వారు రక్షించుకోగలిగారు. బూరుగులంకరేవు వద్ద అధికారులు పదేపదే చెప్తున్నప్పటికీ లంకగ్రామస్తులు కనీసం పట్టించుకోవడంలేదు. అధికారులు పోరు భరించలేక వాటిని కొంతమంది ఒంటిపై వేసుకోవడం మరికొందరూ చేత్తో పట్టుకోవడం వంటి చేష్టలు చేస్తూ ఉంటారు.

కుటుంబ పోషకుడిని కోల్పోయాం: తండ్రి ఆవేదన

రెండు కాళ్లు చచ్చుపడిపోయి ఉన్న కన్న తండ్రికి నిత్యం సేవలు చేస్తు కుటుంబాన్ని మోసే పోషకుడిని కొల్పోయామని చదలవాడ విజయకృష్ణ తల్లిదండ్రులు వెర్రియ్య, పార్వతి రోధిస్తున్నారు. గత ఏడేళ్లుగా మంచంపై ఉన్న తండ్రి వెర్రియ్యకు అన్నీ తానై సేవలు చేస్తున్న ఎదిగొచ్చిన కొడుకు గల్లంతు కావడం ఏమిటని తల్లి పడుతున్న రోధన వర్ణనాతీతం. తండ్రి తరువాత తండ్రిగా రక్షణగా ఉన్న అన్నయ్య గోదావరిలో గల్లంతు కావడంపై చెల్లి కళ్యాణి ఆవేదన చూపరులను సైతం కంటతడి పెట్టించింది. విజయకృష్ణ బి-టెక్ పూర్తిచేసి తండ్రి కోసం బయటకు వెళ్లలేక స్థానికంగా వరి చేల్లో దమ్ములు, పంచాయతీ, రెవెన్యూ అధికారులవద్ద రోజు వారి కూలీకి పనిచేస్తు కుటుంబాన్ని పోషించుకుంటూ ఉంటాడు.

ఆదిశంకర్, వనదుర్గమార్గల నిర్మాణ పనులను పరిశీలించిన నిపుణుల బృందం



ఆదిశంకర్ మార్గ్‌ను పరిశీలిస్తున్న నిపుణుల బృందం

అన్నవరం, జూలై 28: వైసీపీ ప్రభుత్వ హయాంలో హడావిడిగా చేపట్టిన ఆదిశంకర్ మార్గ్, వనదుర్గ మార్గ్‌లను ఆదివారం నిపుణుల బృందం పరిశీలించారు. ముందుచూపు లేకుండా రహదారుల కోసం భవనాలను ఆనుకుని కొండను తవ్వడంవలన వాటికి ఏమైనా ప్రభావం ఉంటుందా ఒకవేళ ఉంటే నివారణకు ఏవిధమైన చర్యలు తీసుకోవాలనే ఉద్దేశంతో దేవదాయశాఖ ప్రత్యేక కమిటీ సూచనలతో ఈవో రామచంద్రమోహన్ నిపుణుల బృందంకు లేఖ రాయడంతో కాన్పూర్ ఐఐటీ రిటైర్డ్ ప్రొఫెసర్ మాధవరావు, స్ట్రక్చరల్ ఇంజనీర్ వీర్రాజులు వీటిని పరిశీలించారు. సహజంగా కొండపై రోడ్డుమార్గం ఏర్పాటు చేసే సమయంలో ఒక వర్షాకాల సీజన్ చూసి అప్పుడు బీటీ రోడ్డును వేయాలి. అప్పటి పరిస్థితుల నేపథ్యంలో ట్రాఫిక్ నియంత్రణకు పనులు చేపట్టారు. ఆదిశంకర్ మార్గ్‌ను ఆనుకుని సీఆర్వో కార్యాలయం ఒక పక్క, మరోపక్క లోయ ఉండడంతో వీటికి రక్షణ చర్యలపై పరిశీలన చేశారు. వనదుర్గ మార్గ్ ఏర్పాటు వలన ప్రసాదం తయారీభవనం, దాత నిర్మించిన డార్మెటరీ భవనాలకు కలిగుతున్న ఇబ్బందులపై పలు సూచనలు చేశారు. వనదుర్గ మార్గ్ ఏర్పాటువలన భవనాలకు ఎటువంటి ప్రమాదం లేదని మైనర్‌గా కొన్ని పనులు చేపట్టాల్సిఉంటుందని సూచించారు. దేవస్థానం ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు నరసింహారెడ్డి, బాల మురళీలు వీరివెంట ఉన్నారు. మూడురోజుల్లో దీనిపై లిఖితపూర్వక నివేదికను అందజేస్తామని నిపుణుల బృందం పేర్కొన్నారు.

90వేల ప్యాకెట్ల సత్యదేవుడి ప్రసాదం విక్రయాలు

సత్యదేవుడి చెంత అమృతతుల్యంగా లభించే స్వామివారి గోధుమరవ్వ ప్రసాదం కొనుగోలు కోసం ఆదివారం తలుపులమ్మలోవ నుంచి తిరుగు ప్రయాణంలో తమ స్వస్థలాలకు వెళ్లే భక్తులు అధికసంఖ్యలో విచ్చేశారు. కొండదిగువ తొలిపావంచా జాతీయరహదారిపై ఉన్న రెండు నమూనాలయాల వద్ద ప్రత్యేక కౌంటర్లను ఏర్పాటు చేసి విక్రయించారు. కొండపైన, కొండదిగువ, జాతీయరహదారిపై ఉన్న కౌంటర్లలలో సుమారు 90వేల ప్యాకెట్లను విక్రయించినట్లు ప్రసాదం విభాగ అధికారులు పేర్కొన్నారు.

ఎగువన తగ్గుతూ.. దిగువన పెరుగుతూ..

- ధవళేశ్వరం వద్ద 15.80అడుగులకు గోదావరి నీటి మట్టం
- 16,14,844 క్యూసెక్కులు సముద్రంలోకి విడుదల



15అడుగులకు పైగా చేరిన నీటి మట్టాన్ని చూపిస్తున్న సూచీ

ధవళేశ్వరం, జూలై 28: పది రోజులుగా పెరుగుతూ తగ్గుతూ ఉధృతంగా ప్రవహించిన గోదావరి ఎగువ నుంచి వస్తున్న వరద నీరు తగ్గుతూ ఉండడంతో ధవళేశ్వరం వద్ద ఆదివారం మధ్యాహ్నం వరకు ఆపై నిలకడగా కొనసాగుతోంది. సోమవారం ఉదయానికి నీటి మట్టంలో తగ్గుదల నమోదుకావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు. ఎగువున భద్రాచలం వద్ద 53.90అడుగుల వరకు, ధవళేశ్వరం వద్ద 15.80అడుగుల వరకు అత్యధికంగా నీటిమట్టం పెరిగి 16లక్షల క్యూసెక్కుల వరదనీరు వచ్చింది. ధవళేశ్వరం వద్ద శనివారం అర్ధరాత్రి 14.50అడుగులకు చేరిన నీటి మట్టం ఆదివారం ఉదయానికి 15అడుగులకు పెరిగింది. ఆపై మరింత వేగంగా పెరిగిన నీటి మట్టం మధ్యాహ్నం 3గంటలకు 15.70అడుగులకు చేరుకుని నిలకడగా కొనసాగుతోంది. ఈ సమయంలో కాటన్ బ్యారేజ్ ద్వారా అత్యధికంగా 16,14,844 క్యూసెక్కులు సుమద్రంలోకి ప్రవహిస్తుంది. ఎగువున భద్రాచలం వద్ద 3వ ప్రమాదహెచ్చరికను దాటిన నీటి మట్టం శనివారం రాత్రి 11గంటలకు 53.90అడుగుల వరకు పెరిగింది. ఆపై క్రమంగా తగ్గుముఖం పట్టిన నీటి మట్టం 53అడుగుల దిగువకు చేరడంతో 3వ ప్రమాద హెచ్చరికను ఉపసంహరించారు. ఆపై మరింత వేగంగా తగ్గుతూ ఆదివారం రాత్రి 11గంటల సమయానికి 47.40అడుగులకు చేరుకుంది. రాత్రి 2వ ప్రమాదహెచ్చరికను, సోమవారం నాటికి మొదటి ప్రమాద హెచ్చరికను ఉపసంహరించేదిశగా నీటి మట్టం తగ్గుతూ ఉంది

అప్రమత్తంగా అధికారులు

ధవళేశ్వరం వద్ద 15.80అడుగుల వరకు నీటి మట్టం పెరగడంతో ఫ్లడ్ సెక్షన్ అధికారులు అప్రమత్తతతో వ్యవహరిస్తూ బలహీన ఏటిగట్లు, అవుట్‌పాల్స్ స్లూయిజ్‌ల వద్ద వరద నియంత్రణ సామగ్రితో అదనపు రక్షణ కల్పిస్తున్నారు. ఎగువ ప్రాంతాల్లో గోదావరి నీటి మట్టం తగ్గడం, ధవళేశ్వరం వద్ద నిలకడగా కొనసాగుతుండడంతో అధికారులు ఊపిరి పీల్చుకుంటున్నారు. అయితే 10 రోజులుగా ఏటిగట్లు వరద నీటిలో నాని ఉండడంతో నీటి మట్టం తగ్గే సమయంలో ఆ ఒరవడికి ఏటిగట్లు కోతకు గురయ్యే ప్రమాదం పొంచి ఉందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వరదలో జలదీక్ష

- వరద వస్తే రోజుల పాటు నరకయాతనే
- ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం ఇచ్చి సురక్షిత ప్రాంతాలకు పంపండి



గోదావరి వరదలో జలదీక్ష చేస్తున్న గ్రామస్తులు

ఎటపాక, జూలై 28: గోదావరికి వరదలు వచ్చే వర్షాకాలం సమయంలో పోలవరం ప్రాజెక్టు ప్రభావంతో ప్రతీఏటా వరదల కారణంగా తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని, ఇక ఈ బాధలు పడలేమని తమకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం ఇచ్చి పునరావాసంగా సురక్షిత ప్రాంతాలకు తరలించాలని కోరుతూ ఆదివారం ఎటపాక మండలం గన్నవరం గ్రామంలో గ్రామస్తులు జలదీక్ష నిర్వహించారు. గతంలో వరదలు వస్తే రెండు మూడురోజుల్లో తగ్గుముఖం పట్టేవని, ప్రస్తుతం వరదలు వస్తే వారం, పది రోజులపాటు వరద తగ్గడంలేదని తెలిపారు. ఈసమయంలో బయట ప్రపంచంతో సంబంధాలు తెగిపోతున్నాయని, ఇలాంటి బాధలు తమకు వద్దని తెలిపారు. గన్నవరం, కృష్ణవరం గ్రామాలను ముంపు జాబితాలోని 41.15 కాంటూరులో చేర్చి, ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ గ్రామాల్లోని భూములకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. తమ గోడును ఎన్డీఏ కూటమిలోని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఆలకించి, తమకు న్యాయంచేయాలని వేడుకున్నారు. ఈకార్యక్రమంలో సర్పంచ్ గడ్డం భద్రమ్మ, ఉపసర్పంచ్ కందుకూరి స్వర్ణ, గ్రామపెద్దలు ములిశెట్టి చంద్రశేఖరరావు, కరి నర్సింహారావు, చిన్న శ్రీను, ఎం. సత్యనారాయణ, శ్రీనివాసరావు, పెరమయ్య పాల్గొన్నారు.

మరిడమ్మ జాతరకు పోటెత్తిన భక్తులు



ప్రత్యేక అలంకరణలో మరిడమ్మ.. దర్శనానికి పోటెత్తిన భక్తులు

పెద్దాపురం, జూలై 28: కాకినాడ జిల్లా పెద్దాపురంలో మరిడమ్మ జాతరకు నాల్గవ ఆదివారం అధిక సంఖ్యలో భక్తులు పోటెత్తారు. తెల్లవారుజామునుంచే అమ్మవారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ అసిస్టెంట్ కమిషనర్ చేబ్రోలు రామ్మోహనరావు ఆధ్వర్యంలో భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని బారికేడ్లు, క్యూలైన్లలో భక్తుల సౌకర్యం కోసం పలు ఏర్పాట్లు చేశారు. అలాగే పలు స్వచ్ఛంధ సంస్థల ఆధ్వర్యంలో భక్తులకు మంచినీరు, చంటి పిల్లలకు పాలు, పులిహోర ప్రసాదాన్ని పంపిణీ చేశారు. పెద్దాపురం డీఎస్పీ లతాకుమారీ పర్యవేక్షణలో సీఐ రవికుమార్, ఎస్సై వెలుగుల సురేష్ ఆధ్వర్యంలో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ప్రత్యేక చర్యలు చేపట్టారు. సుమారు 20 వేల మంది భక్తులు అమ్మవారిని దర్శించుకున్నట్లు ఆలయ వర్గాలు తెలియచేశారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి

- మరొకరికి గాయాలు

కడియం, జూలై 28: కడియం మండలం కడియపుసావరం గ్రామంలో విద్యుదాఘాతంతో ఓ వ్యక్తి మృతిచెందగా మరొకరికి గాయాలయ్యాయి. పోలీసులు వివరాల ప్రకారం.. గ్రామానికి చెందిన దిడ్ల రమేష్ (38) సౌండ్‌సిస్టం నిర్వహిస్తుంటాడు. శనివారం సాయంత్రం స్థానిక ఆలయంవద్ద జరిగే కార్యక్రమానికి సౌండ్‌సిస్టం ఏర్పాటు చేశారు. కార్యక్రమం అనంతరం సౌండ్‌సిస్టం విప్పుతుండగా అతని వద్ద పనిచేస్తున్న ఎం.రాజు వైరును చేతికి చుట్టుకుంటూ వస్తుండగా సౌండ్‌గొట్టాల వైరు చివరిబాగం కరెంటు పోల్ విద్యుత్‌వైరుకు తగిలింది. దీంతో రాజు షాక్‌కు గురయ్యాడు. ఇది గమనించిన రమేష్.. రాజును విడిపించే ప్రయత్నం చేయగా అతడు కూడా విద్యుత్‌షాకుకు గురయ్యాడు. ఈ ఘటనలో రమేష్ తీవ్రంగాను, రాజు స్వల్పంగాను గాయపడ్డారు. రాజును కడియం సీహెచ్‌సీకి, రమేష్‌ను రాజమహేంద్రవరం ప్రభుత్వాసుపత్రికి తరలించగా రమేష్ మృతిచెందినట్లు వైద్యులు ధ్రువీకరించారని పోలీసులు తెలిపారు. రాజు ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ టి.కృష్ణసాయి తెలిపారు.

అంగన్‌వాడీ ఆయా ఆత్మహత్యాయత్నం

నల్లజర్ల, జూలై 28: మండలంలోని అచ్చన్నపాలెం గ్రామానికి చెందిన అంగన్‌వాడీ ఆయా ఉన్నమట్ల కళ్యాణి కూటమి నాయకుల వేధింపులతో ఆత్మహత్యాయత్నం చేసినట్టు భర్త ఆంజనేయులు తెలిపారు. కూటమి నాయకుల ఒత్తిడితో ఐసీడీఎస్ అధికారులు బలవంతంగా తన భార్యకు శనివారం మెమో జారీ చేశారని, దీనితో మనస్తాపం చెందిన తన భార్య.. తాను ఇంటి వద్ద లేని సమయంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలో ఉండగా నల్లజర్ల పీహెచ్‌సీకి తీసుకెళ్లగా మెరుగైన వైద్య నిమిత్తం తాడేపల్లిగూడెం ఏరియా ఆసుపత్రికి తరలించినట్టు ఆంజనేయులు చెప్పారు.

కాకినాడ

31న పెద్దాపురం మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

పెద్దాపురం, జూలై 28: మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం ఈనెల 31న నిర్వహించనున్నట్టు మున్సిపల్ కమిషనర్ కేవీ పద్మావతి తెలిపారు. మున్సిపల్ ఛైర్‌పర్సన్ బొడ్డు తులసీమంగతాయారు, వైస్ ఛైర్మన్ నెక్కంటి సాయి ప్రసాద్ ఆధ్వర్యంలో ఈ సమావేశం జరుగుతుందని ఆమె చెప్పారు.

భూములు కోల్పోయిన రైతులకు పరిహారమివ్వాలి

బీజేపీ నేతల డిమాండ్

గొల్లప్రోలు రూరల్, జూలై 28: పోలవరం కాలువలో భూములు కోల్పోయిన రైతులకు ఎకరానికి రూ.9లక్షలు పరిహారం ఇవ్వడంతో పాటు ఆర్‌ఆర్ ప్యాకేజీ వర్తింపచేయాలని బీజేపీ కిసాన్ మోర్చా రాష్ట్ర కార్యదర్శి బొలిశెట్టి రామకృష్ణ, జిల్లా అధ్యక్షుడు సింగిలిదేవి సత్తిరాజు, పిఠాపురం నియోజకవర్గ బీజేపీ కన్వీనర్ డాక్టర్ బీవీ కృష్ణంరాజులు డిమాండ్ చేశారు. గొల్లప్రోలు మండలం కొడవలి గ్రామంలో కిసాన్‌మోర్చా మండల కమిటీ అధ్యక్షుడు తోట రాజబాబు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ 2023లో ఎకరానికి రూ.5లక్షలు ఇస్తామని అప్పటి ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చిందని, అయితే ఈ పరిహారం సరిగా లేదని చెప్పారు. లాభసాటి వ్యవసాయం కోసం రైతులకు సబ్సిడీపై ఎరువులతో పాటు పీఎం కిసాన్ సమ్మాన్ నిధి కార్యక్రమం ద్వారా ఏటా రూ.6వేలు ఆర్థిక సహాయాన్ని మోదీ నాయకత్వంలోని కేంద్రప్రభుత్వం ఇస్తుందన్నారు. నాయకులు మద్దాలి రామకృష్ణ, కర్రి చిట్టిబాబు, అల్లుబోయిన సూరిబాబు, అడబాల వీరమోహనరావు, దంగేటి దొరయ్య, ఖండవిల్లి మారేష్ పాల్గొన్నారు.

'పేదల రాజ్యాధికారమే చారుమజుందార్ ఆశయం'

ప్రత్తిపాడు, జూలై 28: పేదల రాజ్యాధికారమే చారుమజుందార్ జీవిత ఆశయమని సీపీఐ ఎంఎల్ లిబరేషన్ కేంద్ర కమిటీ సభ్యుడు బుగతా బంగార్రాజు అన్నారు. చింతలూరులో సీపీఐ ఎంఎల్ లిబరేషన్ పార్టీ ఆధ్వర్యంలో చారు మజుందార్ 52వ వర్ధంతి సభను ఆదివారం నిర్వహించారు. బంగార్రాజు మాట్లాడుతూ నక్సలైట్ ఉద్యమం పుట్టుక,పేదల వర్గాలకు రాజ్యాధికారం రావాలనే లక్ష్యంతో ఏర్పడిందని దీని కోసమే చారు మజుందార్ విప్లవ కమ్యూనిస్టు పార్టీని నిర్మించారని చెప్పారు. పేదలు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. సమావేశంలో లిబరేషన్ నాయకులు మానుకొండ లచ్చబాబు, ఆదివాసీ గిరిజన సంఘ రాష్ట్ర అధ్యక్షుడు రేచుకట్ల సింహాచలం, లిబరేషన్ ఏరియా కార్యదర్శి తాడి నాగేశ్వరరావు, లిబరేషన్ అనుబంధ సంస్థ నాయకులు శెట్టి ఏసుబాబు, మాది వెంకయమ్మ, వెంకటరమణ, చిన్నం లచ్చబాబు, దుమ్ముల సింహాచం, ముప్పిడి అప్పలకొండ, కుంచేమరిడమ్మ పాల్గొన్నారు. చారుమజుందార్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

చారుమజుందార్ చిత్రపటానికి నివాళి

ఏలేశ్వరం, జూలై 28: పట్టణంలోని వినోద్‌మిత్రా నగర్‌లో ఆదివారం అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని నిర్వహించారు. సీపీఐ(ఎంఎల్) వినోద్ మిత్రా పార్టీ ఆధ్వర్యంలో కమ్యూనిష్టు విప్లవకారుడు చారుమజుందార్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గండేటి నాగమణి, గుమ్మడి నాగమణి, కందుల వరలక్ష్మి, కుశల నాగులపల్లి, తీగల రాజారావు, కందుల క్రాంతి కుమార్, కోన గంగాధర్ పాల్గొన్నారు.

'అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి'

ప్రత్తిపాడు, జూలై 28: గ్రామీణ ప్రజలు అంటువ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండి ఆరోగ్య పరిరక్షణకు చర్యలు చేపట్టాలని ఐలాజ్ రాష్ట్ర నాయకుడు బుగతా శివ, సీనియర్ న్యాయవాదులు అవసరాల దేవి, పిల్లి బలరాముడు చెప్పారు. ప్రత్తిపాడు మండలం ఈ.గోకవరంలో మండల లీగల్ సర్వీస్ కమిటీ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. శిబిరంలో సీనియర్ న్యాయవాదులు మాట్లాడారు. పిల్లలకు ఇవ్వాల్సిన వ్యాక్సిన్‌లు, పోలియో డ్రాప్‌లు సమయానికి వేయించాలని, మలేరియా, టైఫాయిడ్, డెంగ్యూ వంటి జ్వరాల బారిన పడకుండా పరిశుభ్రత చర్యలు చేపట్టాలని పెద్దిపాలెం పీహెచ్‌సీ వైద్యాధికారి కొండేపూడి యశశ్వి తెలిపారు. 120మంది రోగులకు వైద్యపరీక్షలు నిర్వహించి ముందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ వనపర్తి నాగేశ్వరరావు, ఎంపీటీసీ అన్నిక సత్తిబాబు పాల్గొన్నారు.

'వసతిగృహాలు ఏర్పాటు చేయాలి'

జగ్గంపేట, జూలై 28: గండేపల్లి మండలం రామేశ్వరంపేట,సూరంపాలెం గ్రామాల మధ్య బాలుర, బాలికల వసతిగృహాలు ఏర్పాటు చేయాలని పీడీఎస్‌యూ నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం అక్కడ ఉన్న విద్యార్థులతో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి కె.సతీష్, జిల్లా కార్యదర్శి శ్రీకాంత్ మాట్లాడి వారి ఇబ్బందులు, సమస్యలు తెలుసుకుని నిరసన తెలిపారు. జగ్గంపేట నెహ్రూ, జనసేన నాయకులు, పెద్దలు స్పందించి విద్యార్థుల భవిష్యత్తుకు మార్గాలు చూపాలని కోరారు. సూరంపాలెం టీడీపీ బూత్ లెవెల్ ఇన్‌చార్జ్ చెల్లెరవి, సురేంద్ర, అభి, కుండబాబు, సంతోష్, ధర్మేంద్ర, కార్తీక్ పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ రూరల్ కమిటీ అధ్యక్షుడిగా రాజేష్

సర్పవరం జంక్షన్, జూలై 28: భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) కాకినాడ రూరల్ మండల కమిటీ అధ్యక్షుడిగా రాజేష్ ఎన్నికైనట్టు జిల్లా కార్యదర్శి ఎం.గంగా సూరిబాబు తెలిపారు. ఆదివారం నిర్వహించిన సర్వసభ్యుల సమావేశంలో రూరల్ మండల కార్యదర్శిగా సాహిత్, ఉపాధ్యక్షుడిగా సాయి నిఖిల్, సహాయ కార్యదర్శులు వెంకట మణికంఠ, అమృత, కమిటీ సభ్యులుగా శ్రావణి, కవిత, విద్యా, సిద్ధి రామకైలాష్, గమనివేలు, వాసు, రోహిత్‌లను సభ్యులు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారన్నారు. విద్యారంగ అభివృద్ధి, విద్యారంగం సమస్యల పరిష్కారానికి కృషి చేయడం జరుగుతుందని రాజేష్ తెలిపారు. జిల్లా కమిటీ సభ్యులు సాహిత్, వాసుదేవ్ పాల్గొన్నారు.

అనుమానాస్పద స్థితిలో కార్మికుడి మృతి

పిఠాపురం, జూలై 28: పిఠాపురం శివారులోని ఇటుకల బట్టీలో ఒక కార్మికుడు అనుమానాస్పద స్థితిలో మరణించాడు. పట్టణంలోని ఏడుకాలువల ప్రాంతంలో బొజ్జా సతీష్‌కు చెందిన ఇటుకల బట్టీ ఉంది. అందులో కొత్తపల్లి మండలం కొండెవరం గ్రామానికి చెందిన గాది నూకరాజు కార్మికుడిగా పనిచేస్తున్నాడు. అతడు అక్కడ మరణించినట్టు కుటుంబసభ్యులకు సమాచారం ఇచ్చారు. ఫిట్స్ వాంతులతో మరణించినట్టు బట్టీ నిర్వాహకులు చెబుతున్నారు. అయితే నూకరాజు మృతిపై తమకు అను మానాలున్నాయని, ట్రాక్టర్‌పై నుంచి పడి లేదా ఇతర కారణాలతో మరణించి ఉండవచ్చునని బంధువులు తెలిపారు. ఈ నేపథ్యంలో అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం పిఠాపురం ప్రభుత్వాసుపత్రికి తరలించినట్టు పిఠాపురం ఎస్ఐ మురళీమోహన్ తెలిపారు.

విజయవంతంగా డిపార్ట్‌మెంటల్ పరీక్షలు

కలెక్టరేట్(కాకినాడ), జూలై 28: కాకినాడ అచ్యుతాపురంలో ఉన్న అయాన్ డిజిటల్ జోన్ ఐడీ జెడ్‌లో ఆదివారం డిపార్ట్‌మెంటల్ పరీక్షలు విజయవంతంగా జరిగాయని డీఆర్వో తిప్పే నాయక్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఉదయం జరిగిన పరీక్షలలో 331మంది అభ్యర్థులకు గాను 297 మంది హాజరయ్యారని, 34మంది హాజరు కాలేదన్నారు. అలాగే మధ్యాహ్నం జరిగిన పరీక్షలలో 169 మంది అభ్యర్థులకు గాను 144 మంది అభ్యర్థులు హాజరయ్యారని చెప్పారు. 25 మంది హాజరు కాలేదన్నారు. పరీక్షలు ప్రశాంతమైన వాతావరణంలో జరుగుతున్నాయన్నారు.

నేడు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ

కార్పొరేషన్ (కాకినాడ), జూలై 28: ప్రభుత్వాదేశాల మేరకు సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్టు నగరపాలక సంస్థ కమిషనర్ భావన (ఐఏఎస్) తెలిపారు. స్థానిక శారదాదేవి ఆలయం సమీపంలోని నగరపాలక సంస్థ కార్యాలయంలో ప్రజల నుంచి నేరుగా సమస్యలపై వినతులు స్వీకరిస్తామన్నారు. ఉదయం 9.30 గంటల నుంచి 10.30 గంటల వరకు డయల్ యువర్ కమిషనర్ కార్యక్రమాన్ని నిర్వహిస్తామని 0884-2357800 నెంబర్‌కు సమస్యలు తెలియజేయవచ్చని ఆమె సూచించారు.

ప్రత్తిపాడు నియోజకవర్గ గ్రీవెన్స్ వాయిదా

ప్రత్తిపాడు, జూలై 28: ప్రత్తిపాడు లయన్స్ కమ్యూనిటీ హాల్లో సోమవారం నిర్వహించి తలపెట్టిన ప్రత్తిపాడు నియోజకవర్గ స్థాయి ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్) వాయిదా పడింది. అనివార్య కారణాల వల్ల ఈ నియోజకవర్గ స్థాయి గ్రీవెన్స్‌ను జిల్లా కలెక్టర్ వాయిదా వేశారని తహశీల్దార్ నరసింహారావు తెలిపారు.

'మన్‌కీ బాత్' వీక్షించిన నాయకులు, ప్రజలు

ప్రత్తిపాడు, జూలై 28: బౌరువాక గ్రామంలో ఆదివారం మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని బీజేపీ నాయకుడు కించు జోగిరావు ఆధ్వర్యంలో విద్యార్థులు, స్థానికులు వీక్షించారు. ప్రధాని నరేంద్రమోదీ దేశాభివృద్ధి అంశాలు వివరించగా విద్యార్థులు ఆసక్తిగా తిలకించారు. జిల్లా బీజేపీ అధ్యక్షుడు ఉమ్మడి వెంకట్రావు ఆధ్వర్యంలో పలువురు వీక్షించారు.

కొత్తపల్లి: మన్‌కీబాత్‌లో భాగంగా ప్రధాని టీవీ ద్వారా చేసిన ప్రసంగాన్ని కొండెవరంలో స్థానిక బీజేపీ నాయకులు ప్రజలకు వివరించారు. పిఠాపురం నియోజక వర్గ కన్వీనర్ వానంశెట్టి శ్రీనివాసరావు, మండలాధ్యక్షుడు కొమిరెడ్డి భద్రరరావు ఉన్నారు.

ఏలేశ్వరం: సిరిపురం గ్రామంలో మనకకీ బాత్ ప్రత్యక్ష ప్రసారాన్ని స్క్రీన్ ద్వారా ప్రజలు వీక్షించారు. బీజేపీ జిల్లా కార్యదర్శి కొల్లా శ్రీనివాస్, దాసరి సతీష్, తిబిరిశెట్టి శ్రీను, చిట్రా లోవరాజు, నట్టే ప్రభాకరరావు, మదినే ఉమా ప్రసాద్ తదితరులున్నారు.

సమస్యలన్నీ పరిష్కరిద్దాం : యనమల


నాయకులతో మాట్లాడుతున్న యనమల

తుని రూరల్, జూలై 28: సమన్వయంతో పని చేసి నియోజకవర్గంలో సమస్యలన్నీ పరిష్కరిద్దామని శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడు స్పష్టం చేశారు. తేటగుంట టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయి నాయకులు, కార్యకర్తలతో ఆయన సమావేశమయ్యారు. నియోజకవర్గంలో భవిష్యత్తు ప్రణాళికలు, ప్రధాన సమస్యలు వంటి వాటిపై సమీక్షించారు. సమావేశంలో టీడీపీ నేత యనమల రాజేష్, చింతమనీడి నాగ సోమరాజు, సుర్ల లోవరాజు, గాడి రాజబాబు ఉన్నారు.

పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలి

రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ మైలవరపు కృష్ణతేజ


పిఠాపురం రూరల్: పిఠాపురం మండల పరిషత్ కార్యాలయంలో మొక్కలు నాటుతున్న కృష్ణతేజ

పిఠాపురం రూరల్, జూలై 28: పర్యావరణ పరిరక్షణలో అందరూ భాగస్వాములు కావాలని రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ మైలవరపు కృష్ణతేజ తెలిపారు. జిల్లా, డివిజన్, మండలస్థాయి అధికారులతో కలిసి ఆయన ఆదివారం పిఠాపురం మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో మొక్కలు నాటారు. కార్యక్రమంలో పలువురు అధికారులు పాల్గొన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకం ద్వారా పనిచేస్తున్న సిబ్బందికి ప్రభుత్వ ఉద్యోగులకు ఇచ్చిన 23శాతం పీఆర్‌సీని వర్తింపచేసి జీతాలు పెంచాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ఎంజీఎన్ఆర్ఈజీఎస్ ఎంప్లాయిస్ జాయింట్ యాక్షన్ కమిటీ ప్రతినిధులు కోరారు. ఈ మేరకు పిఠాపురం మండలపరిషత్ కార్యాలయంలో వారు కృష్ణతేజను ఆదివారం కలిసి వినతిపత్రం అందజేశారు. గత ప్రభుత్వంలో తమకు జీతాలు పెంచకుండా వదిలివేశారని, అన్యాయం జరిగిందని ప్రతినిధులు తెలిపారు. ఉపాధి పథకంలో వివిధ కేడర్ల గ్రేడ్ల ఫిక్సేషనల్‌లో జరిగిన అన్యాయాన్ని సవరిస్తూ ప్రభుత్వానికి పంపిన కమిటీ నివేదికను ఆమోదించిన న్యాయం చేయాలన్నారు. 60 ఏళ్ల దాటి పదవీ విరమణ చేసిన 65 మంది ఉద్యోగులు వట్టి చేతులతో ఇంటికి వెళ్తూ మానసిక క్షోభకు గురవుతున్నారని, మానవతా దృక్పథంతో ఉపాధి ఉద్యోగులందరికీ గ్రాట్యుటీ వర్తింపచేయాలని, అవుట్‌సోర్సింగ్‌లో పనిచేస్తున్న ఉద్యోగులకు ఎఫ్‌టీఈలుగా కన్వర్ట్ చేయాలని కోరారు. కృష్ణతేజను ఉపాధి పథకం ఇంజనీరింగ్ కన్సల్టెంట్లు కలిసి ఈసీలను ఏఈఈలుగా మార్పు చేయాలన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

పిఠాపురం: ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి చొరవ తీసుకోవాలని పిఠాపురం నియోజకవర్గ ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రతినిధులు కోరారు. ఈ మేరకు వారు ఆదివారం రాష్ట్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణతేజను కలిసి వినతి సమర్పించారు. వివిధ శాఖల్లో ఎదుర్కొంటున్న ఇబ్బందులు, సమస్యలపై వారు వివరించారు. వీటిని ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్తానని కృష్ణతేజ హామీ ఇచ్చినట్లు పీసీఈడబ్ల్యూఏ వ్యవస్థాపకుడు చామంతి నాగేశ్వరరావు తెలిపారు.

నిధులు విడుదల చేయాలి

కొత్తపల్లి: గత ఐదేళ్లలో పంచాయతీల్లో ఎటువంటి అభివృద్ధి పనులు చేయలేక సర్పంచ్‌లు ఉత్సవ విగ్రహాల్లా ఉన్నారని, ప్రస్తుతం నిధులు విడుదల చేయాలని నాగులాపల్లి ఉపసర్పంచ్ గురాల చిరంజీవికుమార్ రాష్ట్ర గ్రామీణాభివృద్ధి, పంచాయతీరాజ్ శాఖ డైరెక్టర్ కృష్ణతేజకు ఆదివారం వినతిపత్రం సమర్పించినట్టు తెలిపారు. పంచాయతీ రాజ్ చట్టంలో కాలంచెల్లిన నిబంధనల వల్ల సర్పంచ్‌లు, కార్యదర్శులు తీవ్ర ఇబ్బందులు గురవుతున్నారని పేర్కొన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్య కార్మికులకు జీతాలు పెంచేవిధంగా చర్యలు చేపట్టాలని కోరారు.

కుక్కలు.. బాబోయ్!


కాకినాడ సంజయ్‌నగర్‌లో గుంపులుగా వీధి కుక్కలు

కాకినాడ సిటీ, జూలై 28: నగరంలోని పలు ప్రాంతాల్లో వీధి కుక్కల బెడదతో ప్రజలు భయపడుతున్నారు. ఎక్కడికక్కడ కుక్కలు గుంపులు గుంపులుగా రోడ్ల మీద తిరుగుతూ రాత్రి వేళ వాహనదారుల వెంట పడుతున్నారు. దీనికితోడు రాత్రి సమయంలో గంటల తరబడి కుక్కలు అరుచుకుంటూ ప్రజలకు నిద్ర లేకుండా చేస్తున్నాయి. డెయిరీఫారమ్ అపార్టుమెంట్ల ఏరియాలో రోజూ రాత్రి వీధి కుక్కలు దెబ్బలాడుకుంటూ భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నాయి. దుమ్ములపేట, పర్లోవపేట, సంజయ్ నగర్, రెవెన్యూ కాలనీ, సాంబమూర్తినగర్, రేచెర్లపేటలో ప్రజలు వీధి కుక్కల బెడదతో సతమతమవుతున్నారు.

వేట్లపాలెంలో...



సామర్లకోట: మండలంలోని వేట్లపాలెం గ్రామంలో ఏ వీధి చూసినా వీధి కుక్కల సంతతి పెరిగి రోడ్డుపై రాకపోకలు సాగించే పలువురిని కరుస్తుండడంతో ప్రజలు బెంబేలెత్తుతున్నారు. వీధి కుక్కలను గత కొన్నేళ్లుగా తరలించకపోవడంతో వీటి సంతతి సహజంగానే పెరిగిందని వాపోతున్నారు. ఇటీవల వైరస్ తెగుళ్ల వ్యాప్తిచెందడంతో కుక్కకాట్లకు గురైనవారిలో మరింత ఆందోళనలు చెలరేగుతున్నాయి. అధికారులు సత్వరం స్పందించి గ్రామంలో పెరిగిన వీధి కుక్కల నుంచి ప్రజల ప్రాణాలకు రక్షణ కల్పించాలని పలువురు కోరుతున్నారు.

'ఈవోపై చర్యలు తీసుకోవాలి'

సర్పవరం జంక్షన్, జూలై 28: ఇంద్రపాలెం సుబ్రహ్మణ్యస్వామి ఆలయ జూనియర్ అసిస్టెంట్‌గా చోడే రాజును ఉద్యోగం చేయనీయకుండా ఈవో సత్యనారాయణ మానసిక వేధింపులకు గురి చేయడంతోనే ఒత్తిడికి గురై గుండెపోటుతో ఆస్పత్రి పాలయ్యారని, విచారణ నిర్వహించి చర్యలు తీసుకోవాలని ఏపీ దేవదాయ,ధర్మదాయ శాఖ సిబ్బంది సంఘం స్టేట్ ప్రెసిడెంట్ కె.హనుమంతరావు, అధికార ప్రతినిధి కోగంటి రవికుమార్ డిమాండ్ చేశారు. గుండెపోటుతో సర్పవరం ట్రస్ట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతోన్న రాజును ఆదివారం సంఘం ప్రతినిధులతో కలిసి పరామర్శించారు. గుండెపోటుకు గురైన రాజుకు అయిన వైద్యఖర్చులన్నీ ఈవో భరించాలని, అతడిపై అధికారులు విచారణ చేపట్టి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. తన భర్తను ప్రైవేట్ సిబ్బంది ముందు అవమానాలకు గురి చేయడం, విధులకు రాకుండా చేయడం వంటి వేధింపులకు తాళలేక శనివారం ఆత్మహత్య చేసుకుంటానని తనతో చెప్పి బాధపడ్డారని భార్య రమాదేవి తెలిపారు. ఈవో వేధింపులకు అధికారులు విచారణ నిర్వహించి తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సంఘం ప్రతినిధులు కుమార్, సత్తిబాబు తదితరులు పాల్గొన్నారు. ఎన్నికల ముందు ఇక్కడ నుంచి బదిలీ అయ్యాయని, తిరిగి జూన్ 27న ఈవోగా వచ్చానని, 29న రాజు వచ్చిన తర్వాత మళ్లీ విధులకు హాజరు కాలేదని ఈవో జోగా సత్యనారాయణ వివరించారు. తనపై చేస్తున్న ఆరోపణల్లో యధార్థంలేదని, విచారణలో అన్నివిషయాలు వెలుగులోకివస్తాయని వివరణ ఇచ్చారు.

రావిచెట్టులో వినాయకుని రూపం


రావి చెట్టు మొదలులో వినాయకుని రూపం

సామర్లకోట, జూలై 28: సామర్లకోట రైల్వేస్టేషన్ కారు పార్కింగ్ ఎదురుగా ఉన్న భారీ రావి చెట్టు మొదలు భాగంలో వినాయకుని రూపం పలువురిని విస్మయపరిచింది. దీంతో చెట్టుకు ఉన్న వినాయకుని రూపానికి పూలమాల వేసి భక్తితో నమస్కరిస్తున్నారు. రానున్న వినాయకుని చవితి ఉత్సవాలను ఈ చెట్టు ఎదురుగా ఉన్న గణపతి మందిరంతో పాటు వినాయకుని రూపం వద్ద కూడా ఉత్సవాలు నిర్వహిస్తామని ట్యాక్సీ స్టాండ్ డ్రైవర్లు చెప్పారు.

మల్లేపల్లిలో వ్యక్తికి గాయాలు

గండేపల్లి, జూలై 28: మండలంలోని మల్లేపల్లి గ్రామ శివారులో రోడ్డు పనుల నిమిత్తం ఏర్పాటు చేసిన ప్రమాద సూచికల మధ్యలో ఉండే కోన్ తగిలి ఓ ద్విచక్ర వాహనదారుడు గాయపడ్డాడు. రాజమండ్రి వైపు నుంచి జగ్గంపేట వైపు ఎక్స్‌ఎల్ మోటారుసైకిల్‌పై ఆ వ్యక్తి వెళ్తుండగా మల్లేపల్లి శివారున బ్రిడ్జి దగ్గరికి వచ్చేసరికి అక్కడ ఉన్న సూచికల మధ్యలో ఉన్న తాడు కనిపించిక దానికి తలగడంతో వాహనం అదుపుతప్పి కిందపడ్డాడు.

శైలజానాథ్‌ను కలిసిన పోతురాజు



కాకినాడ సిటీ, జూలై 28: కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మాజీ అధ్యక్షుడు డాక్టర్ శైలజానాథ్ కాకినాడలో ఓ ప్రైవేట్ కార్యక్రమానికి విచ్చేసి జిల్లా కాంగ్రెస్ కార్యాలయానికి రాగా అయనను పీసీసీ సభ్యుడు కుక్కల పోతురాజు మర్యాపూర్వకంగా కలిసి శాలుశాతో సత్కరించారు.

గొల్లప్రోలులో వివాదం, ఉద్రిక్తత

ఇరువర్గాలు మోహరింపు


గొల్లప్రోలులో మోహరించిన ఇరువర్గాలు

గొల్లప్రోలు, జూలై 28: చర్చి నిర్వహణ విషయంలో తలెత్తిన వివాదం గొల్లప్రోలులో ఆదివారం సాయంత్రం తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. పట్టణంలోని కరణంగారితోట నూకాలమ్మ గుడి సమీపంలో చర్చి ఉంది. ఈ చర్చి నిర్వహణపై గతంలో స్థానికులు నుంచి అభ్యంతరాలు వ్యక్తమైన నేపథ్యంలో చర్చిని ఒకవైపు నుంచే తెరవాలని, మైకులు వినియోగించారాదని అప్పటి తహశీల్దార్, కమిషనరు, సీఐ సమక్షంలో ఒప్పందం జరిగిందని అక్కడి ప్రజలు తెలిపారు. అయితే అందుకు విరుద్ధంగా చర్చి నిర్వహిస్తున్నారని, మైకులు వినియోగిస్తున్నారంటూ ఆదివారం చర్చి పరిసరప్రాంతాల ప్రజలు అభ్యంతరం వ్యక్తం చేస్తూ నిరసనకు దిగారు. అనుమతులు లేకుండా చర్చి నిర్వహించడంతో పాటు ఒప్పందాన్ని ఉల్లఘించిన వారిపై చర్యలు తీసుకోవాలని, చర్చిని మూసివేయాలని డిమాండ్ చేశారు. అర్ధరాత్రి సమయాల్లో మైకులు పెడుతున్నారని మండిపడ్డారు.ఇదే సమయంలో చర్చి నిర్వహకులు వచ్చారు. ఇరువర్గాలు మోహరించడంతో తీవ్ర ఉద్రిక్తతలు చోటు చేసుకున్నాయి. పోలీసులు రంగప్రవేశం చేసి ఇరువర్గాలతో చర్చించారు. చర్చి నిర్వాహకుడిని పోలీసు స్టేషన్‌కు తరలించారు. దీంతో ఇరువర్గాలు పోలీసుస్టేషన్‌కు చేరుకున్నాయి. పిఠాపురం సీఐ శ్రీనివాస్ అక్కడకు చేరుకుని పరిస్థితిని సమీక్షించారు. చర్చి పాస్టర్‌ను అక్కడ నుంచి పిఠాపురం తరలించారు. చర్చి నిర్వహణతో పాటు ఇతర అంశాలపై స్థానికులు సీఐకి ఫిర్యాదు చేశారు.

గ్రామ పంచాయతీల భవితవ్యంపై చర్చించాలి


సమావేశంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు, నేతలు

సర్పవరం జంక్షన్, జూలై 28: కాకినాడ రూరల్ మండల పరిధిలో గల విలీన గ్రామ పంచాయతీల భవితవ్యంపై కూటమి పార్టీల ఆధ్వర్యంలో ఎమ్మెల్యే పంతం నానాజీతో సమావేశం ఏర్పాటుతో చర్చించాలని నిర్ణయించినట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు చిలుకూరి రామ్‌కుమార్, పార్లమెంట్ ఇన్‌చార్జి రంబాల వెంకటేశ్వరరావు తెలిపారు. ఆదివారం రమణయ్యపేట బీజేపీ కార్యాలయంలో రమణయ్యపేట, వాకలపూడి, వలసపాకల, ఇంద్రపాలెం, చీడిగ, తూరంగి గ్రామ పంచాయతీల కార్పొరేషన్‌లో విలీనంపై చర్చించేందుకు సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 13 ఏళ్ల కిందట కార్పొరేషన్‌లో 8 గ్రామ పంచాయతీలను విలీనం చేయాలని ప్రభుత్వం నిర్ణయించడం, కొంత మంది కోర్టుకెళ్లడం జరిగిందన్నారు. స్వామినగర్, ఎస్. అచ్యుతాపురం పంచాయతీలను విలీనం చేసిన అధికారులు 42,48 డివిజన్లు ఏర్పాటు చేశారన్నారు. మిగతా పంచాయతీలు అటు విలీనం జరక్క, గ్రామపంచాయతీలుగా ఎన్నికలు జరక్కపోవడం, కేంద్రప్రభుత్వం అందించే ఆర్థిక సంఘంనిధులకు నోచుకోకపోవడంతో నిధుల లేమితో పాలన అస్తవ్యస్తంగా మారిందన్నారు. ఆరు గ్రామాల విలీనం తర్వాతే కాకినాడ కార్పొరేషన్‌కి ఎన్నికలు జరపాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి లేఖ రాసినట్టు పార్టీ సీనియర్ నేత దువ్వూరి సుబ్రహ్మణ్యం తెలిపారు. ఈ గ్రామాల విలీనంపై త్వరలో కూటమి పార్టీల నాయకులతో ఎమ్మెల్యే పంతం నానాజీతో కలసి సమావేశం ఏర్పాటు చేసి ముందుకు వెళ్లాలని తీర్మానం చేయడం జరిగిందన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు కవికొండల భీమశంకర్, నండూరి సత్తిబాబు, వెంకటేష్, డిల్లీ నాయుడు, సలాది అనిల్, కాదా మూర్తి తదితరులు పాల్గొన్నారు.

గొల్లప్రోలులో పాదాలమ్మకు బోనాలు సమర్పణ


పాదాలమ్మ తల్లి

గొల్లప్రోలు, జూలై 28: గొల్లప్రోలు భక్తతన్మయత్వంలో ఓలలాడింది. గ్రామ దేవత, అందరి ఇంటి ఆడపడుచుగా పూజలందుకునే పాదాలమ్మవారికి(పాదాంబిక) బోనాలు సమర్పించేందుకు మహిళలు ఊరేగింపుగా వెళ్లారు. బోనాలు శిరస్సున పెట్టుకుని పురవీధుల్లో ప్రదర్శన నిర్వహించారు. పాడిపంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రతిఇంటా సుఖసంతోషాలు వెల్లివిరియాలని, అందరూ ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని కోరుతూ బోనాల పండుగ నిర్వహించారు. అన్నం,ఇతర పదార్థాలను ఉంచిన బోనాలకు పసుపు, కుంకుమతో అలంకరించి వేప కొమ్మలు, మామిడాకులు కట్టి దానిపై దీపం ఉంచి తలపై పెట్టుకుని ప్రదర్శనగా వచ్చి అమ్మవారికి బోనాలు, సారె సమర్పించారు. అనంతరం పాదాలమ్మ వారిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. కార్యక్రమాలకు భక్తులు భారీగా తరలిరాగా ఆలయకమిటీ ప్రతినిధులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

ముత్యాలమ్మతల్లికి బోనాలు

జగ్గంపేట, జూలై 28: జగ్గంపేట మండలం జె.కొత్తూరు గ్రామంలో ముత్యాలమ్మతల్లికి ఆదివారం మహిళలు భక్తిశ్రద్ధలతో బోనాలు సమర్పించారు. డప్పువాయిద్యాలతో అమ్మవారి ఆలయానికి ప్రదర్శనగా వెళ్లి మొక్కులు సమర్పించారు. గ్రామ ప్రజలు ఆయురారోగ్యాలతో సంతోషంగా ఉండాలని నైవేద్యాలు సమర్పించారు. ముత్యాలమ్మతల్లికి పసుపు, కుంకుమలతో చీరలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.


జగ్గంపేట: జె.కొత్తూరు గ్రామంలో బోనాలతో మహిళ ఊరేగింపు

అన్ని ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు

పిఠాపురం మాజీ ఎమ్మెల్యే వర్మ

పిఠాపురం, జూలై 28: ఏలేరు, పీబీసీ ఆయకట్టు పరిధిలో అన్ని ప్రాంతాలకు పూర్తిస్థాయిలో సాగునీరు అందేలా చర్యలు చేపట్టినట్టు పిఠాపురం మాజీ ఎమ్మెల్యే, టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి ఎస్వీఎస్ఎన్ వర్మ తెలిపారు. పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో వర్మను నియోజకవర్గంలోని వివిధవర్గాల ప్రజలు, రైతులు, టీడీపీ నాయకులు, కార్యకర్తలు కలిసి సమస్యలపై వినతిపత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా వర్మ మాట్లాడుతూ ఏలేరు ఆయకట్టుకు పుష్కర ఎత్తిపోతల పథకం ద్వారా గోదావరి జలాలు అందుతున్నాయని, అదే సమయంలో వర్షాలు కురవడంతో ఇన్‌ఫ్లోస్ పెరిగాయన్నారు. తన దృష్టికి తీసుకువచ్చిన సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయా సమస్యలపై అధికారులతో మాట్లాడారు.

మోసం చేశాడంటూ భర్త ఇంటి ముందు నిరసన

కాకినాడ రూరల్, జూలై 28: తనతో భర్త అప్పులుచేయించి తిరిగి వాటిని చెల్లించకుండా మోసంచేసి విశాఖపట్నం నుంచి కాకినాడకు వచ్చి తప్పించుకుని తిరుగుతున్నాడని విశాఖకు చెందిన వివాహిత కాకినాడ ముత్తానగర్‌లోని భర్త ఇంటి ముందు ఆదివారం నిరసన చేపట్టింది. వివరాల్లోకి వెళితే ముత్తానగర్‌కు చెందిన ఎం.జయరాజుతో ముడిదాన అచ్చుతాంబకు విశాఖలో పరిచయమైంది. వారి కుటుంబసభ్యుల అనుమతితో 2019లో వివాహంచేసుకున్నట్టు ఆమె ఫిర్యాదులో పేర్కొంది. వ్యాపారం కోసం విశాఖకు చెందిన పలువురు రూ.28లక్షలు అప్పుఇచ్చారని, అంతేకాకుండా తన బంగారం సుమారు 20కాసులు తాకట్టు పెట్టి రూ.10లక్షలు ఇవ్వడం జరిగింది. అతడి కుటుంబసభ్యులు కూడా విశాఖలో వారి దగ్గరే ఉండి వ్యాపారం చూసుకునే వారని, 3నెలలక్రితం జయరాజు కుటుంబసభ్యులతో కలిసి కాకినాడ వచ్చి కనిపించడం లేదని, ఫోన్ కూడా ఎత్తకపోవడంతో చేసేదేమీలేక కాకినాడలోని వారి ఇంటికి రాగా అత్తమామలు నేను ఎవరో తెలియదంటున్నారని దీంతో ఇంటి వద్ద నిరసన చేపట్టానంది. ఇంద్రపాలెం పోలీస్‌స్టేషన్‌కు చేరుకోగా విశాఖలో ఇప్పటికే దీనిపై కేసు నమోదైందని ఎటువంటి ఫిర్యాదు ఇక్కడ రాలేదని ఎస్ఐ మణికుమార్ తెలిపారు.

వేడుకగా సత్యదేవుడి రథోత్సవం


రథోత్సవం నిర్వహిస్తున్న పండితులు

అన్నవరం, జూలై 28: రత్నగిరివాసుడైన సత్యదేవుడికి వారాంతపు సేవవైన రథోత్సవం ఆదివారం వేడుకగా జరిగింది. ఉదయం 10 గంటలకు స్వామి,అమ్మవార్లను చిన్న టేకు రథంపై ఆశీనులు గావించి పండితుల వేదమంత్రాలు, భక్తుల గోవిందనామస్మరణల నడుమ ముమ్మారు తూర్పురాజగోపురం చుట్టూ ప్రదక్షిణ గావించారు. హారతులిచ్చి తిరిగి ప్రధానాలయానికి స్వామి, అమ్మవార్లను తీసుకెళ్లారు. పీఆర్వో కృష్ణారావు టెంకాయి కొట్టి రథసేవను ప్రారంభించారు.

శాకంబరిగా నూకాంబికా అమ్మవారు



సామర్లకోట, జూలై 28: సామర్లకోట గ్రామ దేవతగా ప్రసిద్ధి పొందిన స్టేషన్‌సెంటర్‌లో నూకాంబికా అమ్మవారిని ఆషాడమాసం పురష్కరించుకుని ఆదివారం వివిధ కూరగాయలతో సర్వాంగ సుందరంగా అలంకరించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. సుమారు టన్నున్నర కూరగాయాలను దండలుగా రూపొందించి దీపారాధన సంఘ సభ్యులచే శాకంబరిగా అలంకరించారు. అనంతరం అన్నదానం చేశారు.

సుబ్బలక్ష్మికి కళాక్షేత్ర అవార్డు


సుబ్బలక్ష్మికి అవార్డు అందజేస్తున్న దృశ్యం

పిఠాపురం, జూలై 28: ప్రముఖ రంగస్థల కళాకారిణి, పిఠాపురానికి చెందిన మురముళ్ల సుబ్బలక్ష్మికి ఏపీఎస్ రెడ్డి కళాక్షేత్ర అవార్డు లభించింది. పిఠాపురం సూర్యరాయ విద్యానంద గ్రంధాలయం చెలికాని భావనరావు సభాసదన్‌లో ఆదివారం ఏపీఐబీసీ జోనల్ మేనేజరు అబ్బిరెడ్డి రమణారెడ్డి సుబ్బలక్ష్మికి ఈ పురస్కారాన్ని, రూ. 10వేలు నగదు అందజేశారు. పుర్తుతికా కళాపరిషత్, మన ఊరు-మన బాధ్యత సభ్యులు తమ వంతు బాధ్యతగా రూ.15వేలును అందించి భవిష్యత్తులో భరోసాగా ఉంటామన్నారు. ప్రభుత్వపరంగా కళాకారుల లేదా వృద్ధాప్య పింఛన్ మంజూరు చేసేలా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. పుర్తుతికా కళాపరిషత్ అధ్యక్షుడు కేవీఎస్ ప్రసాద్, గ్రంధాలయ కార్యదర్శి కొండేపూడి శంకరరావు, బర్రె సత్యనారాయణ, ముమ్మిడి తాతకొండ, బాజిబోయిన నాయుడు, కర్రి భాస్కరరావు, భాను పాల్గొన్నారు.

'గ్రామాలకు నీరందించాలి'

తుని రూరల్, జూలై 28: మెట్ట ప్రాంతానికి చేరుకుంటున్న పుష్కర జలాలతో తుని మండటంలో 30సాగునీటి చెరువులు నిండగా మిగిలిన పుష్కర జలాలను పక్క జిల్లా అనకాపల్లి జిల్లా పాయకరావుపేట మండలం పాలేరుతో పాటుగా పరిసర గ్రామాలకు నీరు అందించి సాగునీరు, తాగునీరుకు చర్యలు చేపట్టాలని ఆ ప్రాంత నేతలు శాసనమండలి ప్రతిపక్ష నేత యనమల రామకృష్ణుడును తేటగుంటలో కలిసి కోరారు. పెద్దిరెడ్డి చిట్టిబాబు, దేవారపు రాజులు, గోపాలకృష్ణ, ఎంపీటీసీ అప్పారావు తదితరులు ఉన్నారు.

'బీజేపీని బలహీనపరిస్తే చర్యలు'

గొల్లప్రోలు, జూలై 28: క్రమశిక్షణ ఉల్లంఘించి పార్టీని బలహీన పరిచే చర్యలు ఎవరు చేసిన చర్యలు తప్పవని బీజేపీ జిల్లా నాయకులు హెచ్చరించారు. గొల్లప్రోలులో ఆదివారం పట్టణ బీజేపీ అధ్యక్షుడు చిట్టా మధు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వారు మాట్లాడుతూ ప్రస్తుతం పాత కమిటీలే కొనసాగుతాయని, కొత్త కమిటీలకు అనుమతి లేదని స్పష్టం చేశారు. సమావేశంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి గండి కొండలరావు తదితరులు పాల్గొన్నారు.

ఉచిత నేత్ర వైద్యశిబిరం

కిర్లంపూడి, జూలై 28: మండలంలోని తామరాడలో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శ్రీసత్యసాయి సేవా ట్రస్టు, శ్రీసత్యసాయి ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన శిబిరాన్ని జనసేన పార్టీ జగ్గంపేట ఇన్‌చార్జి తుమ్మలపల్లి రమేష్ హాజరై ప్రారంభించారు. ఆటో యూనియన్ సభ్యులతో మాట్లాడి అందరూ జనసేన సభ్యత్వాలు తీసుకోవాలన్నారు. మాదారపు వీరబాబు, గోకేడ ప్రసాద్, కాయల మణికంఠ, సత్యంశెట్టి గణేష్, తుంగపల్లి గోవింద్, రాజు ఉన్నారు.

క్రికెట్ టోర్నమెంట్ విజేత మర్రిపాక

జగ్గంపేట, జూలై 28: జగ్గంపేటలో నిర్వహించిన దివంగత సిరపు రాజశేఖర్ రెడ్డి మెమోరియల్ క్రికెట్ టోర్నమెంట్‌లో మర్రిపాక టీం విజేతగా నిలిచి మొదటి బహుమతి సాధించింది. జగ్గంపేట టీం రన్నర్స్‌గా నిలిచింది. బహుమతి ప్రదానానికి రాజశేఖర్‌రెడ్డి తల్లిదండ్రులు పైడియ్య రెడ్డి, లక్ష్మి దంపతులు, భార్య వాణి విశిష్ట అతిథులుగా హాజరయ్యారు.

విద్యార్థులకు కిట్ల పంపిణీ

జగ్గంపేట, జూలై 28: మండలంలోని మన్యంవారిపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు బ్యాగులు, బెల్టులు, షూస్ కిట్లు అందజేశారు. కూటమి నాయకులు పి.కృష్ణ, పి.రాముడు, ఎరికి రాజు, లోవప్రసాద్ పాల్గొన్నారు.